# కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

Published from: Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

గురువారం, హైదరాబాద్ 13.03.2023 | సంపుటి:14 | సంచిక: 340 | పేజీలు: 8 | వెల: 4.00

www.kalamnigha.com


సౌందర్య ఆస్తులతో మోహన్ బాబుకు
## సంబంధం లేదు
ఆరోపణలను తోసిపుచ్చిన సౌందర్య భర్త రఘు

2

## దశలవారీగా ఫీజు రియంబర్స్‌మెంట్
స్పల్పకాలిక చర్చలో మంత్రి లోకేశ్ హామీ

2

# అబద్ధాలతో రాష్ట్రాన్ని నడిపించ లేను

బడ్జెట్ లెక్కలను అణా పైసతో సహా మీ ముందు పెడతాను..
ఏం చేద్దామో చెప్పండి అంటూ విపక్ష నేతలకు ఆహ్వానం

- అప్పుల వారసత్వాన్ని కానుకగా ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం
- ప్రజల సొమ్ము రూపాయి అయినా నేను ఇంటికి తీసుకువెళ్లను
- తెలంగాణ ప్రభుత్వం కుల్లం కుల్లాగా పనిచేస్తుంది
- అప్పుల రాష్ట్రాన్ని చేతిలో పెట్టి దిగిపో అంటే ఎలా?
- ప్రైవేటు విద్యతో పోటీ పడలేకపోతున్న ప్రభుత్వ విద్యాశాఖ
- ప్రైవేటు కన్నా రెండింతలు ప్రతి విద్యార్థి పై ఖర్చు పెడుతున్న ప్రభుత్వం
- ఉద్యోగ నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్

2

స్టేచర్ ఉందని విర్ర వీగినోళ్లు...
## స్ట్రెచర్ మీదకు వెళ్లారు
- వైఖరి మారకపోతే మార్చురీకి వెళ్లడం ఖాయం
- కెసిఆర్ను ఉద్దేశించి రేవంత్ కీలక వ్యాఖ్యలు
- ప్రతిపక్ష నేత మరణం కోరుకోవడం అత్యంత దారుణం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీష్ రావు మండిపాటు

2

## మార్చి 27 వరకు అసెంబ్లీ సమావేశాలు
- 17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్లపై చర్చ
- 19న బడ్జెట్.. 21, 22 తేదీల్లో చర్చ
- బీఏసీ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్ మార్చి12 (నిఘా న్యూస్): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27 వరకు జరుగుతాయి. 14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉన్నాయి. ఈ నాలుగు రోజులు మినహాయించి 12 రోజులు సమావేశాలు జరగబోతున్నాయి. చాలా రోజుల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటారని కెటిఆర్ ఇప్పటికే

మిగతా 2లో



తల్లికి చెల్లికి ఆస్తిలో...
## వాటా ఇవ్వని జగన్
ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు

మహిళాసాధికారిత టీడీపీ పెటెంట్

డీ లిమిటేషన్‌తో 75 మంది మహిళలకు అసెంబ్లీలో చోటు

మహిళా సాధికారతపై అసెంబ్లీలో సిఎంచంద్రబాబు

అమరావతి మార్చి12 (నిఘా న్యూస్) తమ ప్రభుత్వంలో ఏ కార్యక్రమం చేపట్టినా మహిళలను దృష్టిలో పెట్టుకునే చేశామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. శాసనసభలో మహిళా సాధికారితపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఓవైపు మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సమయంలోనే మహిళల పట్ల వివక్షత చూపడం జరుగుతోందన్నారు. ఎన్టీఆర్ టీడీపీ పెట్టినప్పటి నుంచి ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు కృషి చేశారని గుర్తుచేశారు. మహిళా సాధికారిత కోసం నిన్న, నేడు, రేపు టీడీపీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం జండర్ ఈక్విటీ ద్వారా ఆడవారికి సమాన అవకాశాలు కల్పించడమని తెలిపారు. మహిళా సాధికారతను మాటల్లో చెప్పడం కాదని, చేతల్లో చేసి చూపించాలన్నారు. తెదేపాతోనే మహిళా సాధికారత ప్రారంభమైందని

మిగతా 2లో

చెప్పడు మాటలతో...
## చెడిపోతున్న జగన్
కోటరీ గుప్పిట నుండి బయటపడితేనే ఆయనకు భవిష్యత్తు

జగన్ మనసులో స్థానం లేదనే పార్టీ నుండి బయటకు వచ్చాను

మూడున్నర సంవత్సరాల పాటు అవమానాలు భరించాను

కాకినాడ పోర్టుపై సిఐడి విచారణకు హాజరైన విజయ సాయిరెడ్డి

అమరావతి మార్చి12 (నిఘా న్యూస్): జగన్ చుట్టూ కోటరీ ఉందని, ఆ కోటరీ వల్లే ఆయనకు తాను దూరమైనట్లు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. జగన్ మనసులో స్థానం లేదని తెలిశాక తన మనసు విరిగిపోయిందన్నారు. అందుకే పార్టీ నుంచి వెళ్లిపోతున్నానని జగన్‌కు చెప్పినట్లు సాయిరెడ్డి పేర్కొన్నారు. కాకినాడ పోర్టు

మిగతా 2లో

గవర్నర్ ప్రసంగంలో
## పచ్చి అబద్ధాలు
గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం

ఎండుతున్న పంటలపై ప్రభుత్వ విధాన ప్రకటనను ఆశించాను

మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్ మార్చి 12(నిఘా న్యూస్): గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు

మిగతా 2లో

ఉద్రిక్తంగా మారిన
## వైసీపీ పోరుబాట
రాష్ట్రవ్యాప్తంగా వైకాపా యువత పోరు

ర్యాలీలు, ధర్నాలతో రాష్ట్రంలో ఆందోళన

విజయవాడ మార్చి 12(నిఘా న్యూస్): ఫీజుల చెల్లింపుపుపై వైకాపా పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి పోరుబాట పట్టింది. యువత పోరు పేరుతో అన్ని జిల్లాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించారు. ఈ క్రమంలో యువత పోరు పేరుతో కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు

మిగతా 2లో

## ప్రగతివైపు తెలంగాణ అడుగులు

రికార్డు స్థాయిలో 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి

రైతుల అభివృద్ధికి అనేక రకాల చర్యలు

రుణమాఫీ, రైతుభరోసా పథకాల అమలు

అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం

సభకు హాజరైన విపక్షనేత కేసీఆర్

హైదరాబాద్ మార్చి12(నిఘా న్యూస్): అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ

మిగతా 2లో

డీ లిమిటేషన్‌పై
## త్వరలో అఖిలపక్షం
మంత్రివర్గ నిర్ణయం మేరకు అఖిలపక్షంలో చర్చలు: భట్టి

2

రైలును హైజాక్ చేసిన 30 మంది
## మిలిటెంట్ల హతం
190 మంది ప్రయాణికులను రక్షించిన భద్రతా బలగాలు

2

# అబద్ధాలతో రాష్ట్రాన్ని నడిపించ లేను

హైదరాబాద్,మార్చి 12(నిఘా న్యూస్): అబద్ధాలు చెప్పి ప్రభుత్వాన్ని నడపలేనని, నయా పైసా తాను ఇంటికి తీసుకెళ్లనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అప్పుల ఊబిలో కూరుకున్న రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ లెక్కలను అణా పైసతో సహా మీ ముందు పెడతాను ఏం చేద్దాము చెప్పండి అంటూ ఆయన విపక్ష పార్టీలను ఆహ్వానించారు.కొత్తగా ఉద్యోగాలు పొందిన 1292 మంది జూనియర్ లెక్చరర్లకు, 240 మంది పాలిటెక్నికల్ లెక్చరర్లకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని, కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరమన్నారు. కొత్తగా నియామకమైనవారు తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగాలపై కోర్టుల్లో చిక్కుముడులు విప్పుతూ సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలతో గవర్నమెంట్ విద్యాలయాలు పోటీ పడలేకపోవడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువు చెప్పే వారికన్నా గవర్నమెంట్ లెక్చరర్లకే ఎక్కువ నాలెడ్జ్ ఉందని అయినా రిజల్ట్ వారికంటే తక్కువ రావడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను తీర్చి దిద్దాలని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే, ఆ కుటుంబ భవిష్యత్ మారిపోతుందని వారి కష్టాలన్నీ తొలగిపోతాయని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని నోటిఫికేషన్లు ఇచ్చి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడటంలో నిరుద్యోగుల పాత్ర కీలకం అని గుర్తు చేశారు.ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారికి సీఎం అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటల ప్రకారం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అయినా మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అభివృద్ధి పథంలో నడిస్తే భవిష్యత్తరాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగం కూడా ఒక కారణమన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోవడం వల్లే ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని గ్రహించాలన్నారు.

## స్టేచర్ ఉందని విర్ర వీగినోళ్లు... స్ట్రెచర్ మీదకు వెళ్లారు

హైదరాబాద్ మార్చి 12 (నిఘా న్యూస్): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూనియర్ లెక్చరర్లకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '10 నెలలకే తనను అధికారం నుంచి దిగిపో అంటున్నారు.. పనిచేస్తుంటే కాళ్లు పట్టుకొని కిందకు లాగుతున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఉంటే.. ఇప్పుడీ పరిస్థితే వచ్చి ఉండేది కాదు. నేను కూడా పోరాటం చేయాల్సి వచ్చేది కాదు' అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణకు జరిగిన అన్యాయం అంతా ఇంతా కాదు.. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని గుర్తుచేశారు. 'స్ట్రేచర్ ఉందని విర్రవీగారు.. స్ట్రెచర్‌పై పడ్డారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇకనైనా వైఖరి మార్చుకోవాలని.. లేకపోతే స్ట్రెచర్ నుంచి మార్చురీలోకి వెళ్లడం ఖాయమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వానికి ఉద్యోగులు సహకరించాలని.. లేకపోతే పరిస్థితులు మరింత దిగజారిపోతాయని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల వేతనాలు ఏనాడూ ఆలస్యం చేయడం లేదని అన్నారు. కొత్త అధ్యాపకులు రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని అన్నారు. తెలంగాణ వచ్చాక నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని యువత భావిస్తే గత పాలకులు నిరుద్యోగులను, నియామక ప్రక్రియను నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వానికి ఉద్యమం పట్ల బాధ్యత లేక పరిష్కారం దొరకలేదన్నారు. నిరుద్యోగుల ద్వారా గద్దెనెక్కిన గత పాలకులు అధికారంతో విర్రవీగుతుంటే నిరుద్యోగులంతా పట్టుదలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని అన్నారు. కాగా సీఎం రేవంత్ కెసిఆర్ పై చేసిన వ్యాఖ్యలను సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేత మరణం కోరుకోవడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

## చెప్పుడు మాటలతో... చెడిపోతున్న జగన్

› మొదటి పేజీ తరువాయి

అక్రమాల కేసులో సీఐడీ విచారణ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కోటరీ నుంచి బయట పడితేనే జగన్‌కు భవిష్యత్తు ఉంటుంది. జగన్ చుట్టూ కొందరు నేతలు కోటరీగా ఏర్పడ్డారు. జగన్‌ను కలవాలంటే ఈ కోటరీకి లాభం చేకూర్చాలి. నాయకుడు అనేవాడు చెప్పుడు మాటలు నమ్మకూడదు' అని వ్యాఖ్యలు చేశారు. 'కాకినాడ పోర్టులో వ్యాపారం చేశారా లేదా అన్న విషయం తనకుకు తెలియదని సీఐడీ విచారణలో చెప్పానని అన్నారు. . గతంలో సీబీఐ, ఈడీ కేసుల్లో జేడీ లక్ష్మీనారాయణ నన్ను ఏ2గా చేర్చారు. ఇప్పుడు కాకినాడ పోర్టు కేసులో కూడా ఏ2 ఉంచారు. అంతే తప్ప నేను చేసిందేమీ లేదు.ఈ కేసు రిజిస్టర్ అయినప్పుడు వైసీపీలోనే ఉన్నాను. అప్పుడు నాకు పూర్తి వివరాలు తెలియవని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని కేసు నుంచి పక్కకు తప్పించడానికి మీరూ, విక్రాంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారా' అని అడిగారు. అవన్నీ నాకు తెలియవని చెప్పాను. నేను ఒక్కటే చెబుతున్నా, మా అల్లుడు శరత్ చంద్రారెడ్డి కంపెనీ విషయంలో నేను జోక్యం చేసుకోను. ఎవరికీ ఉద్యోగం కూడా ఇవ్వమని అడగను. నాకు కుటుంబ బంధాలే ముఖ్యం. జగన్ మోహన్‌రెడ్డి ప్రమేయ ఉందా అని అడిగారు. నాకు తెలిసినంత వరకూ కేవీరావు, శరత్ చంద్రారెడ్డికి డీల్ చేసింది.. కర్త కర్మ క్రియ విక్రాంత్‌రెడ్డేనని చెప్పాను. అవసరమైతే పిలుస్తామని అన్నారు. ఈ కేసు ఇక్కడితో ఆగినా, ఆగకపోయినా నాకు వచ్చే నష్టం లేదు. నేను కేవీరావుతో మాట్లాడినట్లు నిరూపించండి. నేను ఎవరి దగ్గరా ప్రతిఫలం ఆశించలేదని అన్నారు. వైసీపీలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు నాకూ మా నాయకుడికి మధ్య అభిప్రాయ భేదాలు సృష్టించి, జగన్‌మోహన్‌రెడ్డి మనసు విరిచే ప్రయత్నం చేసి, విజయం సాధించారు. మూడున్నర సంవత్సరాల పాటు అవమానాలు పాలయ్యా. నేను దిగిన ప్రతి మెట్టు ఇంకొకరు పైకి ఎక్కడానికి ఉపయోగపడిరది. దీంట్లో చాలా మంది పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారు. ఈ పార్టీ నుంచి వెళ్లిపోయినందుకు నేను ఏవిధంగానూ నష్టపోవడం లేదు. చిత్తశుద్ధితో పనిచేశా. ఇప్పుడు కూడా జగన్‌మోహన్‌రెడ్డి బాగుండాలని కోరుకుంటున్నా. జగన్ చుట్టూ ఉన్న కోటరీ నుంచి ఎప్పుడు బయటపడతారో ఆ రోజు ఆయనకు భవిష్యత్ ఉంటుంది. ఇంతకన్నా ఏమీ చెప్పలేనని అన్నారు.

## దశలవారీగా ఫీజు రియంబర్స్‌మెంట్

అమరావతి మార్చి12(నిఘా న్యూస్) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పీజీ విద్యార్థులకు గత ప్రభుత్వం తొలగించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ను తిరిగి తీసుకువస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వమే బకాయిలు పెట్టిందని, దీనిపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ చేశారు. సభలో చర్చించకుండా వైకాపా సభ్యులు బయటకు వెళ్లిపోయి తోకముడిచారని ఎద్దేవా చేశారు. విద్యాశాఖలో సంస్కరణలపై శాసన మండలిలో స్వల్ప వ్యవధి చర్చ జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. జీవో 117 వల్ల 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లపై గతంలో పెట్టిన కేసులన్నింటినీ మాఫీ చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## ఉద్రిక్తంగా మారిన వైసిపి పోరుబాట

› మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేతలు ప్రయత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వైసీపీ నేతలు జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి, పోతున మహేష్, గౌతమ్ రెడ్డి వైసీపీ నేతలు కలెక్టరేట్ ముట్టడికి వచ్చారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. అయితే బారికేడ్స్ తోసుకుని మరీ వైసీపీ నేతలు కలెక్టరేట్‌లోకి వచ్చారు. డౌన్ డౌన్ చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు వైసీపీ నేతలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. కలెక్టరేట్ మూడు గేట్లను కూడా ఫ్యాన్ పార్టీ నేతలు ముట్టడించారు. చివరకు పోలీసులను తోసుకొని కలెక్టరేట్లోకి ప్రవేశించిన నేతలు. కలెక్టర్ లేకపోవడంతో డీఆర్ఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వైసీపీ నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పేద విద్యార్థుల ఆవేదనను కూటమి నాయకుల దృష్టికి తీసుకువచ్చే విధంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఒక ఉద్యమం లాగా విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలకు ముట్టడిస్తున్నామన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యార్థులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.

## తల్లికి చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని జగన్

› మొదటి పేజీ తరువాయి

చెప్పారు. మహిళలకు ఆస్తిలో హక్కును తొలిసారి ఎన్టీఆర్ కల్పించారని గుర్తుచేశారు. 'తల్లి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి గతంలో సీఎంగా ఉన్నారు. ఇచ్చిన ఆస్తిని కూడా వెనక్కి తీసుకునేందుకు కోర్టుకు వెళ్లారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తే, తల్లి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వలేదు. మా ప్రభుత్వ హయాంలో తొలిసారి విద్యా, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాం అని చంద్రబాబు అన్నారు. దీంతో వారు బాగా చదువుకున్నారు. ప్రస్తుతం మహిళలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. ఆడబిడ్డ పుడితే రూ.5 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాం. డీలిమిటేషన్ పూర్తయితే సుమారు 75 మంది మహిళలు అసెంబ్లీకి వస్తారని అన్నారు. పసుపు, కుంకుమ కింద రూ.10 వేల చొప్పున రూ.9,689 కోట్లు ఇచ్చాం. మహిళలకు భద్రత, నమ్మకాన్ని కలిగించాం. తెలుదేశం పార్టీ తెలుగింటి ఆడపడుచుల పార్టీ. దీపం2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. డ్వాక్రాలో మహిళలు రూపాయి పొదుపు చేస్తే నేనూ రూపాయి ఇచ్చాను. డ్వాక్రా సంఘాల మద్దతుతో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తాం. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారు. భూమి అంటే సెంటిమెంట్, ఎవరూ ఇవ్వడానికి ఇష్టపడరు. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. అమరావతి బతికి ఉందంటే కారణం మహిళలు చూపించిన చొరవ, తెగువేనని అన్నారు. మహిళా సాధికారిత ప్రారంభం అయ్యింది టీడీపీతోనే అని చెప్పుకొచ్చారు. 1986లో మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు ఇచ్చారన్నారు. మహిళా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చామన్నారు. 1995లో మహిళా ఎంపవర్‌మెంట్ కోసం ఆలోచిస్తూ డ్వాక్రా ఉమెన్ ద్వారా ఎంపవర్ చేయాలని నిర్ణయించామన్నారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని తెలిపారు. దీని వల్ల ఆడబిడ్డలు చదువుకున్నారని, వారు కూడా పనిచేయడం ప్రారంభించారన్నారు. సూర్యకుమారి ఐఏఎస్ ,ఆమె 1996లో గ్రూప్ వన్ ఆఫీసర్‌గా సెలెక్ట్ అయ్యి ఈరోజు మహిళా శిశు సంక్షేమ శాఖా సెక్రెటరీగా పనిచేస్తున్నారన్నారు. ఆరోజు బెనిఫిషరీ ఈరోజు వారి కోసం పాలసీలు రూపొందిస్తున్నారని ఇది సజీవ సాక్ష్యమని చెప్పుకొచ్చారు. పుట్టిన అమ్మాయి భారం కాదు ఇంటికి మహలక్ష్మి అన్నామని, వారి పేరుతో ఓ 5వేలు డిపాజిట్ చేయించామని తెలిపారు. మగపిల్లలు, ఆడపిల్లలకు తేడా లేదని ఆడపిల్లలకు సైకిళ్లు కొనిచ్చినట్లు చెప్పారు.స్పీకర్‌గా ప్రతిభా భారతికి అవకాశం ఇచ్చామన్నారు. 8 శాతంతో ప్రారంభమైన రాజకీయ రిజర్వేషన్లు స్థానిక సంస్థలలో 33 శాతం అయ్యిందన్నారు. ఆడవాళ్లు మగవాళ్ళకంటే తెలివైన వారని, ఈ విషయం చాట్ జీపీటీని అడిగినా చెపుతుందన్నారు. అమెరికా లాంటి దేశంలో కూడా మహిళల్లో సమానత్వం లేదన్నారు. ఆర్టీసీలో ఆడ కండెక్టర్‌లు చాలా బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. 65 లక్షల గ్యాస్ కనెక్షన్‌లు ఆడబిడ్డలకు ఇప్పించామన్నారు. దీపం 2 కింద మూడు సిలెండర్‌లు ఇస్తున్నామని డ్వాక్రా సంఘాలు లేని ఊరూ లేదు, ఇల్లు లేదన్నారు. 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తామని మహిళల అండ

## ప్రగతివైపు తెలంగాణ అడుగులు

› మొదటి పేజీ తరువాయి

కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణఅసెంబ్లీ సమావేశాలు బుధవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు.

## మార్చి 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

› మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. అటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్ట బోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. కీలకమైన బడ్జెట్ ను 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెడుతారు. 20వ తేదీన సెలవు కాబట్టి 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చిస్తారు. 24 , 25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడుతారు. ఈ సమావేశాలు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం బీసీలంతా ఎదురు చూస్తున్నారు. ఈ బిల్లులో బీసీ రిజర్వేషన్ల కోటాపై స్పష్టత వస్తే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. అంతే కాకుండా కేసీఆర్ ఓడిపోయిన తర్వాత మొదటిసారి అసెంబ్లీలో ప్రసంగించ బోతున్నారు. ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానాలు చెప్పాలని రేవంత్ ప్రభుత్వం కసరత్తులు స్టార్ట్ చేసింది. కాబట్టి గతంలో జరిగిన సమావేశాల కంటే ఈ సమావేశాలు మరింత వేడెక్కడం ఖాయం. స్పీకర్ గడ్డం ప్రసాద కుమార్ అధ్యక్షతన జరిగిన బిఎఎసి సమావేశంలో అసెంబ్లీ పని దినాలపై చర్చించారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈనెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు.

## డీ లిమిటేషన్‌పై త్వరలో అఖిలపక్షం

హైదరాబాద్ మార్చి 12(నిఘా న్యూస్): నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి, రాజకీయ పార్టీలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 'జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం అని లేఖలో పేర్కొన్నారు.

## సౌందర్య ఆస్తులతో మోహన్ బాబుకు సంబంధం లేదు

హైదరాబాద్ మార్చి 12(నిఘా న్యూస్): సినీ నటులు మంచు మోహన్ బాబు, సౌందర్య ఆస్తి వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి సంబంధించిన ఆరు ఎకరాల భూమిని సౌందర్య నుంచి ఆయన అక్రమంగా లాక్కున్నారని, అలాగే సౌందర్యను మోహన్ బాబు హత్య చేయించారంటూ ఖమ్మం జిల్లా పోలీసులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. ఈ వార్త ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తోంది. అయితే దీనిపై సౌందర్య భర్త రఘు స్పందించారు. సౌందర్య మరణంలో మోహన్ బాబు లేదని, తమ ఆస్తిని ఆయన లాక్కున్నారనే ఆరోపణలను రఘు ఖండిరచారు. హైదరాబాద్‌లోని ఆస్తి విషయమై కొన్ని రోజులుగా తప్పుడు వార్తలు వస్తున్నాయని ఆయన అన్నారు. అవన్నీ నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. తన భార్య సౌందర్య నుంచి మోహన్ బాబు అక్రమంగా పొందిన ఆస్తి ఏదీ లేదని రఘు తేల్చి చెప్పారు. తనకు తెలిసినంత వరకూ మోహన్ బాబుతో తాము ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని స్పష్టం చేశారు. మోహన్ బాబుతో తమకు 25 ఏళ్లుగా బలమైన మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తన భార్య, బావ, అలాగే ఇరుకుటుంబాలు ఎల్లప్పుడూ సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ఆస్తి వ్యవహారంలో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, తమ నుంచి ఆయన ఎలాంటి ఆస్తులూ స్వాధీనం చేసుకోలేదని మరోసారి సుస్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేయొద్దని కోరుకుంటున్నట్లు రఘు విజ్ఞప్తి చేశారు. కాగా, 17 ఏప్రిల్ 2004న లోక్ సభ ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్‌లో వెళ్తూ ప్రముఖ నటి సౌందర్య చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో సౌందర్య సోదరుడు అమర్నాథ్ సైతం ప్రాణాలు కోల్పోయారు.

## గవర్నర్ ప్రసంగంలో పచ్చి అబద్ధాలు

› మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15 నెలల పేలవమైన, అట్టర్ ఫ్లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్ప,గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్దాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోనని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులు తామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్దాలు చెప్పించి గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

## రైలును హైజాక్ చేసిన 30 మంది మిలిటెంట్ల హతం

లాహోర్ మార్చి12 (నిఘా న్యూస్) పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనలో బలోచ్ వేర్పాటువాదుల చెర నుంచి దాదాపు 190 మంది ప్రయాణికులను భద్రతా బలగాలు రక్షించాయి. అలాగే 30 మంది మిలిటెంట్లను మట్టుపెట్టాయని స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే మిలిటెంట్లు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడిరచాయి. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వత ప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ వెళ్తున్న సమయంలో ఈ హైజాక్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. అలాగే రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే బలోచ్ తిరుగుబాటు దారులు ఆఫ్ఘనిస్థాన్‌లోని తమ కీలక నేతతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాకిస్థాన్ అంతర్గత వ్యవహ

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం చంద్రగిరివారిపల్లిలో వీధి దీపాలు ఏర్పాటుకు స్థానికులతో కలిసి సెక్రటరీ వెంకటేశ్వర్ బుధవారం పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ దీపాలు అమరుస్తాం అని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని సెక్రెటరీ పేర్కొన్నారు.

-చంద్రగిరి, మార్చి, 12 (నిఘా న్యూస్):

## దేవాదులను సందర్శించిన డిగ్రీ విద్యార్థులు

**ఏటూరు నాగారం, మార్చి 12 (నిఘా న్యూస్):** తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులు గణితశాస్త్ర, భౌతిక శాస్త్ర విభాగంల ఆధ్వర్యంలో ఎంపీసీఎస్ రెండవ,మూడవ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులని క్షేత్ర పర్యటనలో భాగంగా ములుగు జిల్లాలోని కన్నాయి గూడెం మండలంలో గల దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ సందర్శనకు తీసుకువెళ్లడం జరిగింది. కాగా ప్రాజెక్టు వివరాలను గైడ్ సాయి విద్యార్థులకు పూర్తిగా వివరించారు.అనంతరం10.కి. మీ దూరంలో గోదావరి పై నిర్మించిన సమ్మక్క సారలమ్మ బ్యారేజ్ సైతం విద్యార్థులు సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అధ్యాయపకులు మాట్లాడుతూ విద్యార్థులు నాలుగు గోడల మధ్య చదువుకోవడం కాకుండా అప్పుడప్పుడు ఇటువంటి క్షేత్ర పర్యటనకు వెళితే వాటి వివరాలు స్వయంగా తెలుసుకుంటారని, విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనశక్తి పెంపొందించాలని ఈ పర్యటనకు తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, దుర్గభవాని (గణిత, భౌతిక శాస్త్రం) విభాగాల అధ్యాయపకులు, ఎంపీసీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## గుత్తి కోయగూడెంలో గర్భిణీలకు వైద్య పరీక్షలు

### వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వైద్యాధికారి హెచ్.ప్రణీత్ కుమార్

**ఏటూరు నాగారం, మార్చి 12 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలోని గుత్తి కోయగూడెంలో బుధవారం కొండాయి వైద్యాధికారి ప్రణీత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గూడెం వాసులతో మాట్లాడుతూ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం గొత్తి కోయగూడెంలో ఉన్న గర్భిణీలు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. గూడెంలోని ప్రజలు ఎండలో తిరగకూడదని, మంచినీళ్లు ఎక్కువ తాగాలని సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సమ్మక్క, ఆశావర్కర్లు లక్ష్మి , జ్యోతి, గూడెం వాసులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

**శేరిలింగంపల్లి, మార్చ్ 12 (నిఘా న్యూస్):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీ కి చెందిన షాహిద బేగంకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి బుధవారం పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇబ్రహీం, మహమ్మద్ బేగ్, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో అటవీశాఖ అధికారి శ్రీదేవి మృతి

**గోకవరం, మార్చి 12 (నిఘా న్యూస్):** అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు రేంజ్ దేవారం పరిధిలో శ్రీదేవి(44) అటవీ శాఖ అధికారినిగా విధులు నిర్వహిస్తున్నారు. గోకవరం మండలం కృష్ణుని పాలెం పంచాయితీ పరిధిలోగల రామన్నపాలెం గ్రామంలో రాత్రి అకస్మాత్తుగా గుండుపోటు రావడంతో ఆమె మృతి చెందారు. ఆమె మృతి పట్ల అటవీశాఖ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గ్రామంలో మరియు విధులు నిర్వహిస్తున్న దేవారం గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని నిలబెట్టు కోవాలి

### విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని డిబిఎఫ్ పాదయాత్ర

**హనుమకొండ, మార్చి 12 (నిఘా న్యూస్):** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో బుధవారం హనుమకొండ పట్టణంలోనీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అంబేద్కర్ విగ్రహ సెంటర్ నుండి కలెక్టరెట్ వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్ కు డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ వినతిపత్రాలు సమర్పించారు. పాదయాత్ర ను డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రౌతు రమేష్, చుంచు రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 24- 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 6.3 శాతం నిధులు కేటాయించి ఎన్నికల హామీని తుంగలో తొక్కిందన్నారు. బుధవారం ప్రారంభ మైన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని చెప్పారు. అసర్ నివేదిక ప్రకారం 5.4 శాతం పాఠశాలలో టాయిలెట్స్ లేవని 19 శాతం బదులు పాడుబడ్డాయన్నారు. పాఠశాలలో 27శాతం బాలికలకు మూత్రశాలల సౌకర్యం లేవని అసర్ నివేదిక స్పష్టంగా పేర్కొందన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అబ్ స్ట్రాక్ నివేదిక ప్రకారం 11.95 శాతం పిల్లలు డ్రాప్ అవుట్ గా మారి బడి బయట ఉన్నారని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డ్రాప్ అవుట్ 29 శాతం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అంతర్జాతీయ మోడల్ స్కూల్ లను ప్రతి మండల కేంద్రంలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, గురుకులాలలో ,సంక్షేమ వసతి గృహాలలో పౌష్టికాహారం అందించాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయంలో నాణ్యమైన ,సమాన విద్యను అందించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని కోరారు. ఈ పాదయాత్రలో డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల కరుణాకర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు పసుల దాసు, గొవింద్ అనిత,దుర్గం పుష్పలత, గాజుల రాజు, సందెల పౌల్,గొవింద్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

### జెండా ఎగరవేసిన మేడ్చల్ జిల్లా కార్యదర్శి వినోద

**ఉప్పల్, మార్చి 12 (నిఘా న్యూస్):** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉప్పల్ లోని బీరప్ప గడ్డ కార్యాలయం వద్ద ఐద్వా జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎన్. వినోద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 1981 మార్చిలో చెన్నై నగరంలో మొట్టమొదటి మహాసభ జరిగింది. ఈ మహాసభల్లోనే ఐద్వా సంఘం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి నినాదాలుగా ఐద్వా తీసుకుందని వెల్లడించారు. దేశానికి కొన్ని శతాబ్దాల కిందటే స్వతంత్రం వచ్చిన రాజ్యాంగంలో స్త్రీ, పురుషులకు అనేక హక్కులను ప్రకటించిన అనేక సమస్యలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయని, చట్టపరంగా రాజ్యాంగపరంగా స్త్రీలకు కల్పించిన హక్కులను అమలు జరిపించుకోవడం కోసం, వరకట్నం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి దురాచారాలను. రూపుమాపడం కోసం. స్త్రీలు నచ్చినవారిని ఎంపిక చేసుకునే హక్కుకై ఇష్టం లేకపోతే విడిపోయే హక్కు, అంటరానితనం, కులతత్వం, మూఢనమ్మకాలు వంటి వాటి నుంచి స్త్రీలు బయటపడాలని సూచించారు. స్త్రీలను లైంగిక వస్తువులుగా చూపించే సంస్కృతిని వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉప్పల్ మండల అధ్యక్షురాలు ఆర్.ఊర్మిళ, డి.గాయత్రి, జె.సుగుణ సుశీలమ్మ, లత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో వైసిపి ఆవిర్భావ వేడుకలు

**శ్రీకాళహస్తి, మార్చి 12 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి వైసిపి కార్యాలయంలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనలతో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైయస్సార్సీపీ కార్యాలయం నందు 15వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాని ఆవిష్కరించి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ వైయస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం అంటే నిరుపేదల పండగ దినం. ఈ రాష్ట్రంలో కాదు దేశంలో కాదు ఏ వ్యక్తి అమలు పరచని విధంగా నవరత్నాలు అనే పథకాన్ని ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా ఘనత వహించిందని పేర్కొన్నారు. అటువంటి జగన్మోహన్ రెడ్డి పార్టీని ప్రారంభించి 15 సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా శ్రీకాళహస్తి వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాని ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు వయ్యాల సుధాకర్ రెడ్డి, కంట ఉదయ్ కుమార్, బాల్ శెట్టి చంద్ర శేఖర్, శ్రీవారి సురేష్, సాధన మున్నా రాయల్ జయ శ్యామ్, డాక్టర్ శంకర్,కొత్త పార్టీ శ్రీనివాస్ రెడ్డి ,కొల్లూరు హరినాథ్ నాయుడు, ఫటాన్ ఫరీద్, ఫాజల్, చింతామణి ఏనాదయ్య, పసల సుమతమ్మ, షర్మిల ఠాగూర్, పసల సురేష్, రఘు, రంగయ్య, ఆరిఫ్,రవి, గుణ, శంకరయ్య, బాబు, చెంచయ్య నాయుడు, వరప్రసాద్ నాయుడు, సుందర రామ్ రెడ్డి, వెంకటేష్, సుధాకర్, అంకయ్య,భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# శరీరంలో నీటి శాతం తగ్గితే కిడ్నీ సమస్యలు

### ఎండాకాలం నీటిని ఎక్కువగా సేవించండి

### మూత్రపిండ వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్

**హైదరాబాద్, మార్చి 12 (నిఘా న్యూస్):** తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే కిడ్నీ వ్యవస్థ సురక్షితంగా ఉంటుందని నగరంలోని కిడ్నీ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్ ప్రజలకు భరోసా కల్పించారు. ముఖ్యంగా ఎండాకాలంలో ప్రత్యేక ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. మార్చి నెల రెండవ గురువారం 13వ తేదీ ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకొని వారు మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ దినోత్సవం ప్రాముఖ్యత తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం అనుసరించి కిడ్నీ వ్యాధులకు గురి కాకుండా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం అన్నారు. వాన కాలం నుండి ఎండాకాలంలో ప్రవేశించాము కావున ఎండల తీవ్రత అధికమవుతుంది. ఎండల వలన శరీరంలో నీటి శాతం తగ్గుతుందని తెలిపారు. దీంతో డి హైడ్రేషన్ కు గురి అవుతామని గుర్తు చేశారు. శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు కిడ్నీ సమస్యలు ఏర్పడే ప్రమాదం ప్రారంభం అవుతుందని పునరుద్ఘాటించారు. ప్రధానంగా మూత్రం పచ్చ రంగులో రావడం, మూత్రంలో మంట, కిడ్నీలో రాళ్ల సమస్య ఏర్పడడం జరుగుతుందని స్పష్టం చేశారు. కిడ్నీలో రాళ్ల సమస్యలు మొదలవుతాయని అన్నారు. జ్వరం రావడం, క్రమంగా నొప్పి మొదలవుతుందని వెల్లడించారు. దీంతోపాటు కిడ్నీ ఇన్ఫెక్షన్ అధికమవుతుందని తెలిపారు. తద్వారా మూత్రపిండ వ్యవస్థ పాడవడానికి ఆస్కారం ఉందని వివరించారు. కాబట్టి ఎండాకాలంలో ఆరోగ్యం పై శ్రద్ధ వహించి, ప్రతి ఒక్కరు మోతాదు ప్రకారం మంచినీరు తాగాలని సూచించారు. రోజుకు మూడు లీటర్ల నుండి నాలుగు లీటర్ల వరకు మంచినీరు త్రాగడానికి కృషి చేయాలన్నారు. ఎండలో అధికంగా ప్రయాణం చేయకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో ప్రయాణించవలసి వస్తే ఉదయం సమయంలో, సాయంత్రం సమయంలో ప్రయాణించడం శ్రేయస్కరమని హితవు పలికారు. తప్పని పరిస్థితుల్లో ఎండలో ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులలోలభించే ఓ ఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా కొబ్బరినీరు, మజ్జిగ, ద్రవ పదార్థాలు తీసుకోవడం విస్మరించకూడదని కోరారు. పైన సూచించిన అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే మూత్రపిండ వైద్య నిపుణుల సంప్రదించి, వారి సూచనల ప్రకారం ఆరోగ్య పరీక్షలు చేసుకుని, వైద్య సేవలు పొందాలని తెలిపారు. అందరూ ఆరోగ్య నియమావళి పాటించి ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

### సాయి నగర్ సబ్ స్టేషన్ లో...

# 11 కెవి ఫీడర్లను ప్రారంభించిన ఎస్ఈ బ్రహ్మం

**చిలుకానగర్, మార్చి 12 (నిఘా న్యూస్):** బోడుప్పల్, చిల్కానగర్ పరిధిలోగల 33/11 కె.వి. సాయి నగర్ సబ్ స్టేషన్ లో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రెండు కొత్త 11 కెవి ఫీడర్లను సూపరిండెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ హబ్సిగూడ పి. బ్రహ్మం ప్రారంభించారు. ఈ ఫీడర్ల ద్వారా 4వేల మంది వినియోగదారులకు మేలు జరుగుతుందని, భవిష్యత్తులో ఎటువంటి లోవోల్టేజ్ సమస్య తలెత్తదని స్పష్టం చేశారు. బోడుప్పల్, చిల్కానగర్ పరిధిలో గల 33/11కేవీ. బోడుప్పల్ 33/11 కే.వీ. సాయి నగర్ సబ్ స్టేషన్ లలో ఇప్పటికే నాలుగు కోట్ల రూపాయలతో రెండు 8 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో రెండు 12.5 ఎం వి ఏ. పవర్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యుత్ అధికారులు తెలిపారు. నాలుగు కోట్ల రూపాయలతో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ల తో పాటు ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ పెంచడం జరిగిందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డి ఈ టెక్నికల్ సూర్య నారాయణ, సుబ్బారావు, డివిజనల్ ఇంజనీర్ ఆపరేష న్ఆపరేషన్, డివిజనల్ ఇంజనీర్ ప్రొటెక్షన్, చిలుకా నగర్ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లెల్ గూడలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వివిధ కాలనీల వాసులు

**బాలాపూర్, మార్చ్ 12 (నిఘా న్యూస్):** మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లెల్ గూడ ఓల్డ్ విలేజ్, పరిసర ప్రాంతాల్లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మూడు నాలుగు రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా కావడంతో సరిపడా నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడేవారని, ముఖ్యంగా వేసవిలో సమస్య మరింత తీవ్రంగా ఉండేది అని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మంత్రిగా ఉన్నప్పుడే ఎమ్మెల్యే సబితా రెడ్డి నూతన పైపులైన్లు, రిజర్వాయర్లు, ట్యాంకులు నిర్మించారని ఆయన అన్నారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగు నీరు సరఫరా అవుతుందని, కాలనీవాసులు డివిజన్ ప్రజల తరపున ఎమ్మెల్యే సబితా రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి మేనేజర్ ప్రమోద్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## సూర్యా పీఠం ట్రస్ట్ కు 10 వేల విరాళం

**గోకవరం, మార్చి 12 (నిఘా న్యూస్):** సూర్యా పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో గోకవరం గ్రామంలో నిర్మితమవుతున్న శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి గోకవరం వాస్తవ్యులు కొలిపాకల ప్రకాష్ పదివేల రూపాయలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు అక్షింతల రాజా, దోసపాటి సుబ్బారావు, తోట సాయిబాబా, గోరు పాపారావు మాట్లాడుతూ దాతల ఆర్థిక సహాయంతో ఆలయ నిర్మాణం నిర్విరామంగా కొనసాగుతున్నదని, దాతల ముందుకు వచ్చి యధాశక్తి సహాయ సహకారాలు అందించవలసిందిగా దాతలకు విజ్ఞప్తి చేశారు.

## వెంకటరెడ్డి పంతులు సత్రంలో అన్నదానం

**కోరుకొండ, మార్చ్ 12 (నిఘా న్యూస్):** కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా మిరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం నందు మూడవరోజు విశేష అన్నదాన కార్యక్రమం జరిగింది. సత్రం కార్యనిర్వహణ అధికారి గండి వెంకటలక్ష్మి కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాయకుల సమక్షంలో విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల ఐదు రోజులు మధ్యాహ్నము, రాత్రి రెండు పూటలా ఉత్సవాలకు హాజరై భక్తులకు యాత్రికులకు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19 నుండి అన్నమయ్య కీర్తనల శిక్షణా శిబిరం

**శేరిలింగంపల్లి, మార్చి 12 (నిఘా న్యూస్):** అన్నమాచార్య భావనా వాహిని సంస్థ గత 46 సంవత్సరాలుగా అన్నమయ్య కీర్తనల ప్రచారానికి నిర్విరామంగా కృషి చేస్తూనే ఉందని పద్మశ్రీ డా.శోభారాజు అన్నారు. ప్రతిసంవత్సరం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేస్తున్నారు.అన్నమాచార్య సంకీర్తనల ప్రచారమే లక్ష్యంగా తన ముందుకు సాగే శోభారాజు లాంటి వారి వద్ద కీర్తనలు నేర్చుకోవడం ఎంతో గొప్ప విషయం. నేర్చుకోవడం యోగం నేర్పించడమే భోగం అనే నినాదంతో సాగే "వేసవి వెన్నెల" ఎంత ఆదరణ పొందిందో అందరికీ తెలిసిందే. ఇపుడు అన్నమాచార్య సంకీర్తనలు నేర్పే మరో బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా, సంగీత పరిజ్ఞానం లేకుండా, గాత్రం ఎలా ఉన్నా ఎవరైనా కీర్తనలు నేర్చుకోవచ్చు. ఈ సంవత్సరం మార్చి 19 వ తేదీ నుండి మార్చి 25 వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గం. ల నుండి 7:30 గం. ల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు, వివరాలకు సౌజన్య 9550129946/ రాజు రాజేశ్వరి 9441276825 / రమణ 9848024042 నంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## లక్ష్మారెడ్డి కాలనీలో ఘనంగా మహిళా దినోత్సవం

**ఉప్పల్, మార్చి 12 (నిఘా న్యూస్):** ఉప్పల్ డివిజన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డివిజన్ లోని లక్ష్మారెడ్డి కాలనీలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రజిత రెడ్డి హాజరయ్యారు. కాలనీల్లోని మహిళలందరూ ఒక చోటకి చేరుకొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మేకల హనుమంత్ రెడ్డి మాజీ కార్పొరేటర్ అనల రెడ్డి శామీర్పేట్ ధర్మా రెడ్డి శామీర్పేట్ యది రెడ్డి స్వరూప మేకల రజనీ కె.మంజుల మేకల సుశీల మందుముల అంజి రెడ్డి మేకల వెంకట్ రెడ్డి గోనె ప్రేమ్ సాగర్ వెంకటయ్య గౌడ్ జగన్ మోహన్ రెడ్డి సల్ల మల్ల రెడ్డి బొంగు రమేష్ లాలాపేట్ నర్సింహా రెడ్డి నారాయణ గౌడ్, లింగ రెడ్డి, మేకల దయాసాగర్ రెడ్డి,శంసుందర్ రెడ్డి వీరేశం గుప్తా,లక్ష్మి నర్సింహ పాల్గొన్నారు.

## నగరంలో ఎంహెచ్ఐ లీన్ మాన్యుఫ్యాక్చ రింగ్ ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 12 (నిఘా న్యూస్):** ప్రెసిషన్ ఇంజినీరింగ్ లో అగ్రగామిగా ఉన్న ఆజాద్ ఇంజినీరింగ్ తునికొల్లారంలో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్(ఎంహెచ్ఐ) ప్రత్యేక లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించినట్లు ఆజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ అత్యాధునిక కేంద్రాన్ని జపాన్ లోని ఎంహెచ్ ఐ ఎనర్జీ సిస్టమ్ జీటీసీసీ బిజినెస్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మసాహిటో కటావోకా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ లతో కలసి ప్రారంభించినట్లు తెలిపారు.

## క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

### ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గ లత

**శంషాబాద్, మార్చి 12 (నిఘా న్యూస్):** క్షయ వ్యాధిని అనుసరించి వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ దుర్గ లత వెల్లడించారు. ఈ మధ్యకాలంలో చిన్నారులకు సైతం క్షయ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. శంషాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చిన్నారుల వైద్యనిపుణులు డాక్టర్ దుర్గ లతా ఆధ్వర్యంలో టీబీ ప్రోగ్రాం మేనేజర్ టీబీ వ్యాధి లక్షణాలను గురించి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు, నర్సింగ్ వైద్య సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తొలగించిన బస్ షెల్టర్‌ను.. ఆసుపత్రి యాజమాన్యం త్వరగా ఏర్పాటు చేయాలి

- పాత బస్ షెల్టర్లను తొలగిస్తే కఠిన చర్యలు తప్పవు అంటున్న అధికారులు
- ఆర్టీసీ బస్సు షెల్టర్లు అక్రమంగా తొలగిస్తే కఠిన చర్యలు తప్పవు అన్న ఆర్టీసీ యాజమాన్యం
- బస్సు షెల్టర్లు తొలగించిన వారిని ఉపేక్షించేది లేదన్న విజిలెన్స్ అధికారులు

**నాగారం, మార్చి 12 (నిఘా న్యూస్):** నాగారం మునిసిపల్ పరిధిలో విజయ హాస్పిటల్ వద్ద సుమారు 25 సంవత్సరాల క్రింద ఏర్పాటుచేసిన బస్సు షెల్టర్ ను తొలగించిన విషయమై విజిలెన్స్ అధికారులు, ఆర్టీసీ డిపో అధికారులు వచ్చి యధావిధిగా ఏర్పాటు చేయాలని విజయ హాస్పిటల్ యజమాన్యంకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. విజిలెన్స్ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం సుమారు 25సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన బస్సు షెల్టర్ను కుట్రపూరితంగా విజయ హాస్పటల్ యజమాన్యం తొలగించడం జరిగిందని దానిని పరిశీలించడం జరిగిందని, హాస్పటల్ యజమాన్యం బస్సు షెల్టర్ మాకు అడ్డుగా ఉందని మేమే తొలగించామని చెప్పడం జరిగిందని అధికారులు తెలిపారు. యాడ్ ఏజెన్సీ వాళ్లకు విజయ హాస్పటల్ యజమాన్యం ఫోన్ చేసి బస్సు షెల్టర్ ను ఇక్కడి నుండి తొలగిస్తారా లేక మమ్ములను తొలగించమంటావా అని గత మూడు నాలుగు నెలల నుంచి ఇబ్బంది పెడుతున్నారని యాడ్ ఏజెన్సీ వాళ్ళు మాకు తెలిపారని అధికారులు తెలిపారు. విజయ హాస్పిటల్ యజమాన్యం కావాలని మానవీయ కోణం ఏమాత్రం ఆలోచించకుండా ప్రజల పట్ల ఏమాత్రం బాధ్యత లేకుండా బాధ్యత రహితంగా వ్యవహరించడం హాస్పిటల్ అనే పదానికి అనర్హులని ఇలాంటివారు ప్రజలకు ఏం సేవ చేస్తారు అని అన్నారు. స్థానిక 9వ వార్డు మాజీ కౌన్సిలర్ కొమ్మిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి స్థలాన్ని పరిశీలించి గతంలో ఉన్న వద్దే బస్సు షెల్టర్ ను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించడంతో, హాస్పిటల్ యజమాన్యం దిగివచ్చి గతంలో ఎక్కడ ఉందో అక్కడే ఏర్పాటు చేస్తామని తెలపడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, ఆర్టీసీ డిపో అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ఇంటి పనులు తగ్గించాలని సిపిఎం ధర్నా

**వైరా, మార్చి 12 (నిఘా న్యూస్):** సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఎర్రదండు పోరుబాట పట్టారు. సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గత 20 రోజుల నుండి మున్సిపాలిటీ పరిధిలో చేసిన సర్వేలో ప్రజలు తెలిపిన పలు రకాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైరా మున్సిపాలిటీ వద్ద వందల సంఖ్యలో ప్రజలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో బారీగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని, ఇందిరమ్మ కాలనీ వద్ద వాగుకు కరకట్ట నిర్మాణం చేపట్టాలని, పల్లిపాడు డబల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద, గంధం టవర్స్ వద్ద శాశ్వత సైడ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని, సత్రం బజార్ రోడ్డు డ్రైనేజీ పునః నిర్మించాలని, కెరళ తరహాలో పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని, ఉపాధి హామీతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని, కరెంటు లైన్లకు మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలని, పెండింగులో ఉన్న రేషన్ కార్డులు, వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు మంజూరు చేయాలని, ప్రధానమైన డ్రైనేజీలను, అంతర్గత రోడ్లు నిర్మించాలని, సోమవరంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. గండగలపాడులో శ్మశాన వాటికను నిర్మించాలని, జర్నలిస్టులకు యన్.యస్.పి క్వార్టర్స్ స్థలాన్ని కేటాయించాలని, వైరాలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని, నివాస గృహాలు అన్నింటినీ అన్ లైన్ లో నమోదు చేయాలని మున్సిపాలిటీ కమిషనర్ వేణుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరావు, దిగ్గి కృష్ణ, మచ్చ మణి, తోట నాగేశ్వరావు, చెరుకుమల్లి కుటుంబరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్, బొంతు సమత, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల మోహన్ రావు, పైడిపల్లి సాంబశివరావు, రాచభంటి భత్తిరన్న, అనుమోలు రామారావు, తోట కృష్ణవేణి, కామినేని రవి, మల్లెంపాటి రామారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, అమరనేని కృష్ణ, మల్లేంపాటి ప్రసాదరావు, సంక్రాంతి పురుషోత్తం, కంసాని మల్లికాంబ, ఒర్సు సీతారాములు, యసమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**వాజేడు, మార్చి 12 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని, గ్రామాలలో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు. బుధవారం వాజేడు మండల కేంద్రంలో ఐటీడీఏ పీవో. చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను నిజమైన అర్హులను గుర్తించి అందజేయడానికి చొరువ చూపాలని, మండల కేంద్రాలలోని ఎంపీడీవో, ఎంపీవో కీలక పాత్ర పోషించాలని అన్నారు. వేసవికాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని, అవసరమైన పక్షంలో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను ఇప్పటికే సేకరించడం జరిగిందని, నష్టపోయిన రైతులకు ఆయా విత్తన కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. నష్టపోయిన రైతుల వివరాలను మండల వ్యవసాయ కార్యాలయంలో రెవెన్యూ కార్యాలయంలో సూచిక బోర్డులపై పేర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, నష్టపోయిన రైతు పేరు లేని పక్షంలో గురువారంలోగా పేరు నమోదు చేయించుకోవాలని అన్నారు. మండలంలో అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆయా పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ పంపును ప్రారంభించిన కలెక్టర్

### హాజరైన పోలీస్ కమిషనర్ డాక్టర్.బి.అనురాధ

**సిద్దిపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** క్వాలిటీ క్వాంటిటీకి పెద్దపీట వేయడం జరుగుతుంది. ఎలాంటి కల్తీ లేకుండా పోలీస్ పెట్రోల్ పంపులో స్వచ్ఛమైన పెట్రోల్, డీజిల్ లభిస్తుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఇరువురు సంయుక్తంగా మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా సిద్దిపేట పట్టణం పొన్నాల గ్రామ శివారు పోలీస్ కన్వెన్షన్ సెంటర్ ఎదురుగా హనుమాన్ టెంపుల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పోలీస్ పెట్రోల్ పంపులో డీజిల్, పెట్రోల్ ఎలాంటి కల్తీ లేకుండా క్వాలిటీ, క్వాంటిటీగా ఉంటుందని తెలిపారు. సిద్దిపేట పట్టణ ప్రజలు ప్రముఖులు వ్యాపారస్తులు చుట్టుపక్కల గ్రామాల వారు ప్రజలు పెట్రోల్, డీజిల్ పోసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ పెట్రోల్ పంపు ద్వారా వచ్చే ఆదాయం పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది, వెల్ఫేర్ కార్యక్రమాలకు ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ కన్వెన్షన్ ద్వారా వచ్చే ఆదాయం కూడా పోలీసు వెల్ఫేర్ సొసైటీకి వినియోగించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ కన్వెన్షన్ సెంటర్ పోలీస్ కుటుంబ సభ్యులకు మెయింటనెన్స్ ఖర్చులతో ఇతరులకు అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించడం జరిగిందని పోలీస్ కన్వెన్షన్ సెంటర్ అద్భుతంగా ఆహ్లాదకరంగా సుశాలమైన పార్కింగ్ తో బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తం రెడ్డి, సతీష్, రవీందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు విష్ణు ప్రసాద్, రాజేష్ ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, శ్రీధర్, శ్రీధర్ గౌడ్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఇన్స్పెక్టర్లు,సిఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, సీసీ నితిన్ రెడ్డి, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరామ ఆగ్రో సర్వీసెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**అశ్వారావుపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** అశ్వరావుపేట మండలం, వినాయకపురం చిలకల గండి ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద శ్రీరామ ఆగ్రో సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో మెగా సర్వీస్ క్యాంప్ ఏర్పాటు తో పాటు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీరామ ఆగ్రో సర్వీసెస్ ఎండి జీ రమేష్ ఈ రక్తాన్ని వందలాదిమంది సికిల్ సెల్ అనేమియా, తలాసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదాన శిబిరంనీ భద్రాద్రి బ్లడ్ డొనేషన్ ఆర్గనైజేషన్ గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి, గుగులోతు బాబు, పొదుటూరి ప్రేమ్ సాయి,ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషం అని కొనియాడారు. వేసవి కాలంలో రక్తం కొరత ఎక్కువగా ఉండటం వల్ల రక్త నిలువలు తగ్గుతున్నాయి. కావున మీ ప్రాంతాలలో 10-30 మంది వరకు ఒక్కటై రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని భద్రాద్రి బ్లడ్ డొనేషన్ ఆర్గనైజేషన్ ఫౌండర్ గుజ్జులా వేణు గోపాల్ రెడ్డి కోరారు. జి ఎం బి కృష్ణ, ఎఫ్ జి శ్రీకాంత్, విశాల్ కస్టమర్ కేర్ మేనేజర్ స్టాప్, బి రాజు కెనరా బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు. సంకల్ప వాలంటరీ ఆర్గనైజేషన్ ఖమ్మం, వారు రవిచంద్ర, తిరుపతిరావు, సింధు, కిషోర్, సన్నీ, లోకేష్ పాల్గొన్నారు.

# పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో మహిళా దినోత్సవం

- ప్రతిరోజు మహిళా దినోత్సవం జరుపుకునే రోజు రావాలి
- సిపి డాక్టర్ బి.అనురాధ

**సిద్దిపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా సందర్భంగా పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ, జిల్లాలో ఉన్న మహిళ పోలీస్ అధికారులు, సిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు మహిళా దినోత్సవ జరుపుకునే రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళల సమానత్వం ఇంటినుండే ప్రారంభం కావాలి అమ్మాయిల చదువు ఇంటికి వెలుగు, మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి, ఎలాంటి చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాలి. మహిళా సాధికారతకు చదువు చాలా ముఖ్యం విద్యా ఉపాధి రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలి. తల్లిదండ్రులు ఇంట్లో మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా చూడాలి సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమన్నారు. మహిళలు అన్ని రంగాలలో పురోగమించడమే అసలైన అభివృద్ధి అన్నారు. పురుషులతో పాటు మహిళలను సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో మహిళ భాగస్వామ్యం పెరగాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని సూచించారు. మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం ఉద్యోగ అవకాశాలు విద్య ఆరోగ్యం వంటి అంశాలలో మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్, ఏఓ యాదమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, మహిళా ఏఎస్ఐలు, రుక్మమ్మ, సువర్ణ, హెడ్ కానిస్టేబుళ్లు స్వాతి, భాగ్య, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బంది, సిపిఓ కార్యాలయ సిబ్బంది, భరోసా సెంటర్, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ బుకింగ్ ను పరిశీలించిన కలెక్టర్

**పెబ్బేరు, మార్చి 12 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ (పంటల నమోదు) సర్వేను బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పరిశీలించారు. వేసిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటలకు వాడిన ఎరువులు ఇతర వివరాలను అడిగారు.క్రాప్ బుకింగ్ సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి 50 వేల సాయం

### అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్

**హనుమకొండ, మార్చి 12 (నిఘా న్యూస్):** మృతుడు కదిరిక బచ్చయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి(ఏబీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్ తెలిపారు.ఖిలా వరంగల్ మండలం జక్కలొద్దికి చెందిన నిరుపేద కదరిక బచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి యాభై వేయిల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచికి మారుపేరుగా నిలిచిన కదిరిక బచ్చయ్య మృతి చెందడం బాధాకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు(డిబీఎఫ్)మాదాసి సురేష్, ప్రజా సంఘాల నాయకులు మాట్ల మురళి,మోరే ఐలయ్య, మంద నవీన్,వేల్పుగొండ నర్సింగరావు,కదిరికి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మద్దూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణ

### నిరుద్యోగ మహిళలకు అవకాశం

**మద్దూర్, మార్చి 12 (నిఘా న్యూస్):** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో పథకంలో భాగంగా బాలికా సాధికారతకై మద్దూర్ పట్టణ కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భేటీ బచావో భేటీ పడావో పథకం ప్రాధాన్యతను వివరిస్తూ, నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య ప్రాధాన్యత వివరించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుద్యోగ మహిళలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణ, కాంగ్రెస్ నాయకులు, ఇన్చార్జి సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ శిక్షణ కేంద్రం నిర్వాహకులు కంరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అమర వీరులను స్మరిస్తూ ఉప్పల్ లో ఎస్ఎఫ్ఐ ర్యాలీ

**ఉప్పల్, మార్చి 12 (నిఘా న్యూస్):** భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడానికి వారి విప్లవాత్మక భావజాలాన్ని గుర్తుచేసేందుకు ఉప్పల్ మండల ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువకులు భారీగా పాల్గొని జైభగత్ సింగ్ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అవినాష్, జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్‌లు చూపిన త్యాగ మార్గం ఇప్పటికీ ఆదర్శప్రాయమైందని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడానికి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే విధంగా వీరి స్ఫూర్తిని మనం అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ ఉప్పల్ మండల అధ్యక్షుడు సాయి, కార్యదర్శి శ్రీమాన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, ప్రైవేటీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఎస్ఎఫ్ఐ కట్టుబడి ఉంటుందని వారు స్పష్టం చేశారు.ఈ ర్యాలీ ద్వారా విద్యార్థులు సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాజవాదం సిద్ధాంతాలను పాటిస్తూ సమాజ మార్పు కోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత, సహాయకర్దర్శి శ్యామ్ , జిల్లా కమిటీ సభ్యులు మనీష్,ఉప్పల్ మండల్ కమిటీ సభ్యులు అజయ్, రాజేష్,గిరి,సాయి,రాకేష్,సాయి రామ్, రామచరణ్, ప్రణీత్, సాయి తేజ, జి.సంజయ్, బి.సంజయ్, వర్షిత్, నీరజ్, సాను, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో మోడల్ హౌస్‌ను పరిశీలించిన ఏఈ

**అశ్వారావుపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ నమూనా భవనాన్ని హౌసింగ్ ఏఈ రాము పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంతో పాటు నమూనా ప్రదర్శనకు మండలానికి ఒక భవనం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ములకలపల్లి భవనం స్లాబ్, దమ్మపేట భవనం లెంటెల్ లెవల్, మిగతా మండలాల్లోని భవనాలు పలు దశల్లో ఉన్నాయని ఆయన తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

**క్రోసూరు, మార్చి 12 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో శ్రీ అభయా ఆంజనేయ స్వామి వారి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా భక్తులకు క్రోసూరు పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సాంబశివరావు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు హెల్త్ అసిస్టెంట్లు ప్రేమ రాజు ప్రహ్లాద్ ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సూచికల బోర్డు తొలగిస్తే కఠిన చర్యలు

### ఉప్పల్ ఎమ్మార్వో వాణి రెడ్డి

**ఉప్పల్, మార్చి 12 (నిఘా న్యూస్):** ప్రభుత్వ స్థలాల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ తాసిల్దార్ వాణిరెడ్డి పేర్కొన్నారు,ఉప్పల్ తాసిల్దార్ వాణిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సునీల్ ఆదేశాల మేరకు ఆర్, ఐ స్వర్ణలత రెడ్డి,జూనియర్ అసిస్టెంట్ వెంకన్న,ఇతర అధికారులు బుధవారం ఉప్పల్ మండల పరిధిలోని మల్లాపూర్ లోని సర్వేనెంబర్ 24 లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు పెట్టడం జరిగింది,మల్లాపూర్ లో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు రెవెన్యూ నడుం బిగించింది,బోర్డులను తొలగిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఉప్పల్ తాసిల్దార్ వాణి రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్ తో పాటు శిక్షణ అందజేత

**జగ్గంపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** స్థానిక టవర్ కాలనీలో గల హిజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ పి సురేంద్ర, నీలు ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెండు నెలల కాలంగా స్త్రీలకు టైలరింగ్ కోచింగ్ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ ముఖ్య అతిథులు దైవజనులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ హిజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దైవజనులు పాస్టర్ పి సురేంద్ర కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు జేవిఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, వెలిశెట్టి బుజ్జి , బద్ది సురేష్, జిల్లా పాస్టర్ల అధ్యక్షులు దొమ్మిటి సామ్యూల్ సాగర్, జిల్లా గౌరవ అధ్యక్షులు జోసెఫ్ బెన్నీ , జిల్లా సెక్రటరీ సీరం ఐజాక్ , జిల్లా ఎక్సిక్యూటివ్ సేక్రెటరీ విక్టర్ సామ్యూల్ , ట్రెజరర్ మిస్సు విజయ్ కుమార్, జిల్లా అడ్వైసర్ జాన్ డేనియల్, రీజినల్ చైర్మన్ యోబు, జగ్గంపేట అధ్యక్షులు వెలిసెట్టి రాంబాబు, పాల్గొన్నారు.

## నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

**విశాఖపట్నం, మార్చి 12 (నిఘా న్యూస్):** జీవీఎంసీ 15వ వార్డులో ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సింహాద్రి పురంలో మాజీ కార్పొరేటర్ విశాఖ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను ఉద్దేశించి నడింపల్లి కృష్ణంరాజు మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా ఎస్సీ,ఎస్టీ బీసీ మైనారిటీ మహిళలకు ఆ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయని కొనియాడారు.

## ఎంఎన్ఆర్, ఈజీఎస్ పనులను నెలాఖరు లోగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

**సిద్దిపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** సిద్దిపేట కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్న పనులపైన పంచాయతీ రాజ్, డిఆర్డిఓ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖలో ఎంఎన్ఆర్ ఈజీఎస్ కింద చేపడుతున్న పనులు సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ పాఠశాల లో మరుగుదొడ్లు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చెయ్యాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సిసి రోడ్ పనులు గుర్తించివి త్వరగా ప్రారంభించి వేగంగా పూర్తి చెయ్యాలని తెలిపారు. ఇది వరకు పూర్తనా పనులకు ఎఫ్ టి ఓ జెనరేట్ చేసి ఆన్లైన్ అప్లోడ్ చెయ్యాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే డిఆర్డిఓ అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అంగన్వాడీ పాఠశాలలో చేపడుతున్న మరుగుదొడ్లు నిర్మాణం వేగంగా పుర్తి చెయ్యాలి. పనుల్లో వెనుకబడిన మండలంలో వేగవంతం చేయాలని పంచాయతీలకు డిఈ లకు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ప్రాధాన్యత ప్రకారం అన్ని పనులు పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్యా, పంచాయతీ రాజ్ ఇంజనీర్ శాఖ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిఈ లు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని సెల్ ఫోన్ టవర్ ను అడ్డుకోండి

### ఉప్పల్ డిసికి ఫిర్యాదు చేసిన కార్పొరేటర్

**ఉప్పల్, మార్చి 12 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ లో శివాలయం పక్కన ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ ని వ్యతిరేకిస్తూ బస్తివాసులు కార్పొరేటర్ బన్నాలకు ఫిర్యాదు ఈ మేరకు కార్పొరేటర్ స్పందిస్తూ వచ్చిన బస్తీ వాసులతో కలిసి డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుని అక్రమంగా నిర్మిస్తున్న సెల్ టవర్ ని తొలగించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె గీత మాట్లాడుతూ పర్మిషన్ లేకుండా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ ని వెంటనే తొలగించాలని లేని పక్షాన డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలోనే బస్తీ వాసులతో పాటు కూర్చొని నిరసనగా ధర్నా చేస్తానని ఉప్పల్ డీసీని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు వెంటనే స్పందిస్తూ సెల్ టవర్ నిర్మిస్తున్న వారిని పిలిపించి వారి వద్దనున్న అనుమతి పత్రాలను పరిశీలిస్తానని తెలుపుతూ అదేవిధంగా టౌన్ ప్లానింగ్ వారికి సెల్ టవర్ నిర్మిస్తున్న భవనం యజమానిని వారి దగ్గర ఉన్న భవన నిర్మాణ పర్మిషన్ పత్రాలను తెప్పించి పరిశీలించాల్సిందిగా ఆదేశించడం జరిగింది. సెల్ టవర్ నిర్మిస్తున్న భవనానికి అనుమతి లేకుంటే వెంటనే సెల్ టవర్ ని తొలగిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. విద్యుత్ అధికారి ఏ డి ఈతో, ఫోన్లో మాట్లాడుతూ అనుమతి లేని భవనాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకండని తెలుపుతూ సెల్ టవర్ నిర్మిస్తున్న భవనానికి అనుమతి లేకుంటే వెంటనే విద్యుత్ కనెక్షన్ తొలగించాలని విద్యుత్ అధికారి డిఈని ఆదేశించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ,సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ఎండి షఫీ, ఎండి గౌస్ శ్యామ్,బంటి గౌడ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాలలో పర్యటించిన సిపి

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

**కరీంనగర్, మార్చి 12 (నిఘా న్యూస్):** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్ లోని పలు ప్రాంతాలను, ప్రధాన కూడళ్ళను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సందర్శించారు. టౌన్ డివిజన్లోని కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ పోలీసు స్టేషన్లలోని పలు సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ కమిషనర్ పర్యటించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను, ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ క్రమబద్ధికరణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలను పర్యవేక్షించారు. కమిషనరేట్ లో ప్రధాన రహదారులను సందర్శించారు. పోలీసు స్టేషన్ ల పరిధులను చూసారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ వెంట టౌన్ డివిజన్ ఏసిపి వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసిపి స్వామి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రమేష్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ పరీక్షలు జరుగుతున్నందున పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరిగే తీరును ఆయన పరిశీలించారు. అనంతరం కరీంనగర్ బస్టాండ్ ను సందర్శించారు. ఆర్టీసీ అధికారులతో సమావేశమయ్యారు. బస్టాండ్ ఆవరణలో గల సీసీ కెమెరాలు ఏర్పాటు వాటి పనితీరును గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ తో పాటు టౌన్ డివిజన్ ఏసిపి వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసిపి యాదగిరి స్వామి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రమేష్ లతోపాటు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కీసరలో ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

**కీసర, మార్చి 12 (నిఘా న్యూస్):** ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మంచాల మహేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్ మాదిగ ఆధ్వర్యంలో మూడవ రోజు నిరసన దీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ నాయకులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్వకేట్ బార్ అసోసియేషన్ మెంబర్ బోడ శ్రీనివాస్ రావు దీక్షలో పాల్గొన్నారు. కీసర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంచాల మహేందర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాతనే గ్రూప్ 1,2,3 ఇతర ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అహర్నిశలు పాటు పాడుతామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కర్రె గణేశ్ మాదిగ మాట్లాడుతూ గతేడాది ఆగస్ట్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ బిడ్డలకు వర్గీకరణపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ధర్నాకు కుషాయిగూడ ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు చినింగని ఆనంద్ మాదిగ, హాకింపేట ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు శివ మాదిగ, రాష్ట్ర బిజెపి నాయకులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, కీసర మండల బిజిపి ప్రధాన కార్యదర్శి కొల బాల్ రాజ్ యాదవ్, మండల మాజీ ఎంపీపీ రామారం సుజాత మాదిగ, గోధుమకుంటా మాజీ ఎంపీటీసీ మంచాల పెంటయ్య మాదిగ, ములుగు మండల ఎమ్మార్పీఎస్ కార్యదర్శి కొమ్ము వినోద్ మాదిగ విచ్చేసి ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డ్ సభ్యులు శీలం మల్లేష్ మాదిగ, మండల యం ఆర్ పి ఎస్ ఉపాధ్యక్షుడు కంచమీది సంతోష్ మాదిగ, చిర్యాల్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాదిగ, యం ఆర్ పి ఎస్ రాంపల్లి గ్రామ ఉపాధ్యక్షుడు మంచాల నర్సింగ్ రావు మాదిగ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొడుగొల్ల రవి మాదిగ, మీసాల శ్రీశైలం కొమ్ము లక్ష్మణ్, మీసాల భాస్కర్ మాదిగ, నిరుడు మధుబాబు మాదిగ, చినింగని వినోద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహానికి కూతవేటు దూరంలో వైన్ షాప్

### వైన్ షాపును తరలించాలని ప్రేమ్ నగర్ వాసుల విజ్ఞప్తి

**అంబర్ పేట, మార్చ్ 12 (నిఘా న్యూస్):** అంబర్ పేట్ అలీకేఫ్ వద్ద ప్రేమ్ నగర్ కు వెళ్లే దారిలో జనవాసాల నడుమ ఏర్పాటు చేసిన శ్రీ మహంకాళి వైన్ మార్ట్ ను తరలించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి కూతవేటు దూరంలో ఈ వైన్ షాప్ ఏర్పాటుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనవాసాల మధ్య, ప్రధాన రహదారిని అనుకుని వైన్ షాపును ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడ రోడ్డుపై ఆక్రమ పార్కింగ్ పెరిగిపోయిందని వారంటున్నారు. వైన్ షాప్ పక్కనే పర్మిట్ రూమ్ కు అనుమతి ఇవ్వడం వల్ల ఉదయం నుంచి అర్ధరాత్రుళ్ల వరకు ఇక్కడ మందు బాబులు చిత్తుగా మద్యం సేవిస్తూ స్థానికంగా నానా హంగామా సృష్టిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతినిత్యం ఇక్కడ మందు బాబుల నడుమ గొడవలు జరుగుతూ యుద్ధ వాతావరణం నెలకొంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైన్ షాప్ వద్ద మందుబాబుల న్యూసెన్స్ కారణంగా కూరగాయలు కొనడానికి, ఇతరత్రా పనుల కోసం వెళ్లే మహిళలు, యువతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బస్తీ వాసులు తెలిపారు. జనవాసాల మధ్య ఈ వైన్ షాప్ ఏర్పాటు చేయడం వల్ల తాము భవిష్యత్తులో మందు బాబులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తాము గతంలోనే కాచిగూడ ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదని, వైన్ షాప్ ఏర్పాటుకు అనుమతించారని వారు తెలిపారు.ఇదే విషయమై కాచిగూడ ఎక్సైజ్ అధికారులను అడిగితే అన్ని చూసుకుని వైన్ షాప్ ఏర్పాటుకు అనుమతించామని చెప్పారని బస్తివాసులు ఆరోపించారు. జనవాసాల మధ్య వైన్ షాప్ ఏర్పాటుకు ముందు స్థానికుల అభిప్రాయం తీసుకోరా అని అడిగితే, ఆ అవసరం లేదని ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని స్థానికులు ఆరోపించారు.అసలే ఇరుగ్గా ఉన్న ఈ ప్రాంతంలో వైన్ షాప్ ఏర్పాటు చేయడం వలన ఆక్రమ పార్కింగ్ పెరిగిపోయి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వారు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అలీ కేఫ్ సమీపంలో జనవాసాల మధ్య వైన్ షాప్ ఏర్పాటు చేసిన ఈ వైన్ షాపును ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రేమ్ నగర్ బస్తీ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ గా మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెనివాట్ల కు చెందిన ఎం డీ వాహిద్ ఎంపికయ్యారు.జాబ్ వచ్చిన నేపథ్యంలో బుధవారం ఆయన తన సంతోషాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఇటీవలే టీ జీ పీ ఎస్ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ పరీక్షల్లో మల్టీ జోన్ 2 నుంచి వాహిద్ కెమిస్ట్రీ లెక్చరర్ గా ఎంపికైనట్టు హైదరాబాద్ లోని రవీంద్ర భారతీ ఆడిటోరియంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్ మీడియట్ బోర్డ్ జయప్రద భాయి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు.

*-మద్దూర్, మార్చి 12 (నిఘా న్యూస్):*

## రహదారి భద్రత పై అవగాహన

**నారాయణపేట, మార్చ్ 12 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని వీర్ సావర్కర్ చౌరస్తా రహదారి పై ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్ రాజు మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నిజాంపేట్, మార్చ్ 12 (నిఘా న్యూస్):** బల్కంచేల్క తండా గ్రామపంచాయతీ పరిధిలోని చందర్ నాయక్ తాండాకు చెందిన పాతిలో హరి సింగ్ (59) సంవత్సరాల అనే వ్యక్తి హైదరాబాద్ లో ని ఉస్మానియా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించాడు .మతిస్థితం సక్రమంగా లేక పోవడానికి తోడు మద్యానికి బానిసై మూర్చ్ వ్యాధి వచ్చి తన ఇంటి ముందే పడిపోయినట్టు తాండవాసులు తెలిపారు. తీవ్ర గాయాల పాలైన హరి సింగ్ ను హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రి లో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించినట్లు వారు తెలిపారు. మృతుని భార్య రాంకీ బాయ్ ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఉస్మానియా ఆస్పత్రిలో కల్హేర్ పోలీసులు పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## వికలాంగుడికి వీల్ చైర్ అందించిన మహిళలు

**కుత్బుల్లాపూర్, మార్చి 12 (నిఘా న్యూస్):** సూరారం డివిజన్ విశ్వకర్మ కాలనీలో విశ్వకర్మ కాలనీ సమాఖ్య అధ్యక్షురాలు బెజ్జంకి లత ,కాలనీ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ రెడ్డి సెక్రటరీ సదానందం చేతుల మీదుగా పుట్టుకతో వికలాంగుడైన 25 సంవత్సరాల అబ్బాయికి వీల్ చైర్ అందివ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మాట్లాడుతూ ఒక వికలాంగుడికి మా వంతు సహకారంగా వీల్ చైర్ అందించడం చాలా సంతోషకరమని అన్నారు. అనంతరం మహిళలను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అలాగే మహిళలని గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు మానస,సరిత,లత నిర్మల,సామ్రాజ్యం, సుధా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ ను సన్మానించిన బిజెపి నేతలు

**మద్దూర్, మార్చి 12 (నిఘా న్యూస్):** మద్దూర్ నూతన మున్సిపల్ కమిషనర్ గా శ్రీకాంత్ బుధవార బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మద్దూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు, ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి టీ.సాయిలు, ఉపాధ్యక్షులు డీకే. భరత్, శక్తి కేంద్రం ఇంచార్జ్, కోశాధికారి రాఘవేంద్ర చారి, బుత్ అధ్యక్షులు శ్రీనివాస్, ఆర్ భరత్, కాశీనాథ్, హరీష్, శేఖర్,గోవింద్ రాజ్, బాలకృష్ణ, భాస్కర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి సర్కారుపై తిరుగుబాటు తప్పదు

- ఇచ్చిన హామీలు అమలు చేయాలని భూమన డిమాండ్
- పార్టీ శ్రేణులతో హోరెత్తిన తిరుపతి కలెక్టర్ కార్యాలయం

**తిరుపతి, మార్చి 12 (నిఘా న్యూస్):** ఫీజు రీయంబర్స్ మెంట్, నిరుద్యోగ బృతిని వెంటనే విడుదల చేయాలని, మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన యువత పోరు విజయవంతమైంది. యువత పోరుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున తరలివచ్చారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై నిరసనలతో హోరెత్తించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వందల సంఖ్యలో పోలీసులు వలయంగా చుట్టుముట్టగా పోలీసు వలయాన్ని దాటుకుని విద్యార్థులు గేటు వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో తమకు పరీక్షలు రాయడానికి అవకాశం లేకుండా కాలేజీల యాజమాన్యం హాల్ టిక్కెట్టులు ఇవ్వడం లేదని బాధిత విద్యార్థులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ అధ్యక్షులు డాక్టర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మేకతోటి రాజేష్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, యువత, విద్యార్థి సంఘం నేతలు, బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. బుధవారం ఉదయం నుంచే పోలీసులు ఆ పరిసర ప్రాంతాలను చుట్టుముట్టి ఎక్కడికక్కడ నిర్బంధం చేసినప్పటికీ ఊహించని స్థాయిలో పార్టీ శ్రేణులు చేరుకున్నారు. పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసం, నిరుద్యోగ యువతను చంద్రబాబు సర్కారు చేసి నయవంచనను ఎండగట్టారు. జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో పోరాటాలతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. జగనన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదించారు. ఆ తరువాత విద్యార్థులకు, యువతకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఆపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనికి వెళ్లి యువత పోరు ఎందుకు చేయాల్సి వచ్చిందని, ప్రభుత్వం చేయవలసిన పనులు ఏమిటన్న విషయాలను విసదీకరించి రాసిన లేఖను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి, అధికారం కోసం అడ్డమైన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక పేద ప్రజలను మోసం చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదు.. ప్రభుత్వం నుంచి పేదలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతూనే ఉంటాం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలతోనే పుట్టింది.. జగన్మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఎంతమంది ఎన్నిరకాలుగా ఇబ్బందులు పెట్టినా లెక్క చేయకుండా ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రశ్నిస్తాం. బాధితుల పక్షాన నిలబడి పోరాడుతాం. ఇందులో ఎటువంటి అనుమానాలు వద్దు. ప్రజలకు మేలు కలిగించడానికి ఎంతవరకైనా పోరాడుతామని చెబుతున్నాం. అంటూ జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి మీడియాకు వివరించారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని, ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నిరుద్యోగ బృతి ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేంత వరకు పోరాడుతామని, పోరాటం తమకు కొత్తకాదన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి ఉద్యమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కనుక ఆయన నాయకత్వంలో ఉద్యమించేందుకు తాము ఎప్పటికీ సిద్ధంగానే ఉంటామని, కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చివరగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అబద్ధాలతో యువత అన్యాయమైపోయిందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు.

## వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలి

### ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షకు బిజెపి నేతల సంఘీభావం

**ఏటూరు నాగారం, మార్చి 12 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధత చేశాకే ఉద్యోగ పోటీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని మండల ఎమ్మార్పీఎస్, ఎంపీ ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ రెండవ రోజు నిరసన దీక్షలు చేపట్టారు. అందుకుగాను బుధవారం ఏటూరు నాగారం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి వారికి పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగల రిజర్వేషన్లకు అసెంబ్లీ సమావేశాలలో చట్టబద్ధత కల్పించాలని అన్నారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు గాడి చర్ల రాజశేఖర్, బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి, ఎంఎస్పి. జిల్లా ఉపాధ్యక్షులు ఏంపల్లి శంకర్ మాదిగ, నాయకులు దేపాక సతీష్ మాదిగ, గుగ్గిళ్ల సురేష్ మాదిగ, పడుదల సతీష్ మాదిగ, వేల్పుల మనోజ్ మాదిగ, తోకల శివకుమార్ మాదిగ, వెంకటాపూరం మండల అధ్యక్షులు పరికి వేణు మాదిగ, మండల నాయకులు పరికి నర్సింగరావు మాదిగ, ఎంఎస్పి. మండల అధికార ప్రతినిధి వావిలాల ముత్తయ్య మాదిగ, సమ్మయ్య మాదిగ, బిక్షపతి మాదిగ,గుద్దేటి చంటి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి యువతను మోసం చేసిన చంద్రబాబు

- ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి
- కర్నూల్ జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి

**కర్నూలు, మార్చి 12 (నిఘా న్యూస్):** కర్నూలులో జరిగిన యువత పోరు కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను మోసం చేసింది చంద్రబాబే అని ఆరోపించారు. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల ద్వారా విద్యార్థులను, నిరుద్యోగులకు ఆశచూపి గెలిచిన తర్వాత యువతను మభ్యపెట్టి మోసం చేసింది చంద్రబాబే అని అన్నారు. వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి అండగా యువత పోరు కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని వారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి నిజాయితీని నిరూపించుకో లేని పక్షంలో రాబోవు రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీలు, సమన్వయకర్తలు, జిల్లానాయకులు, ఏడు నియోజకవర్గ నాయకులు,విద్యార్థులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కంటి సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

### కంటి వైద్య నిపుణులు డాక్టర్.సునీత

**వికారాబాద్, మార్చి 12 (నిఘా న్యూస్):** కళ్ల సంరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కంటి వైద్య నిపుణులు డాక్టర్ సునీత వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని జిల్లా అందత్వ నివారణ వైద్య విభాగంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రామచంద్రయ్య, వైద్య ఆరోగ్య అధికారిణి ప్రొఫెసర్ పద్మ ఆధ్వర్యంలో గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గ్లకోమా కంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 9వ తేదీన ప్రారంభమయ్యాయి అని పేర్కొన్నారు. గ్లకోమా వారోత్సవాలు 15వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. 40 సంవత్సరాలు నిండిన వారందరూ గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటికి గాయాలైన వారు, మధుమేహ వ్యాధితో ఉన్నవారు, రక్తపోటు, తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చూపు కోల్పోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. కావున 40 సంవత్సరాలు పైబడిన వారందరూ గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుని తగిన వైద్య సేవలు పొందాలని కోరారు. కంటి సంరక్షణ పాటించి ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

## శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



**వలిగొండ, మార్చి 12 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర నగర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ గౌరవ అధ్యక్షునిగా వాకిటి అనంతరెడ్డి, అధ్యక్షునిగా భీమిడి యాదిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోన్ వాకుల సాయిలు, ప్రధాన కార్యదర్శిగా రచ్చ శ్రీనివాస్, కోశాధికారిగా మారోజు పోషణ చారి, సభ్యులుగా బత్తిని పాండు గౌడ్ ఎడ్ల నవీన్ రెడ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం కాలనీ అధ్యక్షునిగా ఎన్నికైన తాను జడ్పిటిసి మరియు ఎన్ ఆర్ జె సి నిధులనుండి సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో కాలనీలో విధి లైట్స్ ఏర్పాటు చేయడంతో పాటు కాలనీలో కమ్యూనిటీ హాలుకు జెడ్పిటిసి నిధులను మంజూరు చేయించి పనులు జరుగుతున్నాయని కాలనీ వాసుల అందరి సహకారంతో కాలనీ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నూతన కమిటీ కూడా కాలనీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఎన్నికైన కమిటీకి కాలనీ వాసులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిలుముల మల్లారెడ్డి, కణతాల అశోక్ రెడ్డి, మారోజు అనిల్ కుమార్, వేముల వెంకటేష్, కౌకుంట్ల బాల్ రెడ్డి, ఆరూరు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మానవహక్కుల నేతకు సన్మానం

**ముస్తాబాద్, మార్చి 12 (నిఘా న్యూస్):** అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా ఇటీవల నూతంగా ఎన్నికైన మహమ్మద్ జహంగీర్ ను జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శాలువాతో ఆత్మీయంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు, కేటిఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మొంగని మనోహర్, కేటీఆర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, సీనియర్ నాయకులు శంకర్ నాయక్, తిరుపతి నాయక్, ప్రభు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలి

**బాలాపూర్, మార్చ్ 12 (నిఘా న్యూస్):** దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కర్మాన్ ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం ఈ ఓ ఎన్ లావణ్య అన్నారు. బుదవారం ఆలయంలో దాతలు జాలే నర్సింహారెడ్డి, ప్రేమలత లు వారి తల్లిదండ్రులు స్వర్గీయ జాలె వెంకట్ రెడ్డి, అండాలమ్మ జ్ఞాపకార్థం వంటశాల ప్రాంగణంలో రఫ్ గ్రానైట్ పరచడం, డి ప్రకాష్ రెడ్డి, బబ్బూరి ఆనంద్ కుమార్ గౌడ్, స్వర్గీయ కంచనాపల్లి రవీందర్ రావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన రాజ గోపురం ముందర గ్రిల్స్ పనులు పూర్తి చేసి ఆలయానికి అప్పగించారు. ఈ సందర్భంగా వేద పండితులచే ఆశీర్వచనాలు, స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు దాతలకు ఈఓ సమక్షంలో అందించారు. ఈఓ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో దాతలను సంప్రదించగా వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయంలో భక్తులకు అన్నదానాలు నిర్వహించుటకు అన్నదాన సత్రం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు.

## విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**క్రోసూరు, మార్చి 12 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో క్రోసూరులో శ్రీ అభయ ఆంజనేయ జనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బుధవారం పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## నాటు వైద్యుడు జగ్గయ్య మృతితో గ్రామంలో విషాదం

**ధర్మపురి, మార్చి 12 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో రేషవేణి జగ్గయ్య నాటు వైద్యంతో వివిధ గ్రామాల ప్రజలకు అనేక సేవలు అందించారు. వైద్యశాలలో దొరకని చెట్ల మందుతో ఎందరికో చేతులు, కాళ్లు ఎముకలు విరిగిన వారికి చెట్ల మందుతో కట్లు కట్టి ఎందరో పేద ప్రజలకు తన వంతు సేవలు అందజేశారు. రేషవేణి జగ్గయ్య మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. హాస్పిటల్ లో కూడా అందని వైద్యం ఆయన దగ్గర దొరుకుతుండేదని చాలా మంది విశ్వాసం, ఆయుర్వేద కట్లతో సేవ చేసి చుట్టుపక్క గ్రామాల ప్రజల ప్రేమ అభిమానాలు పొందారు. జగ్గయ్య పార్థివ దేహాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి కన్నీరు మున్నీరు అయ్యారు. జగ్గయ్య మృతితో పత్తిపాక గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

అంబర్ పేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి బుధవారం మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధినేత కేసిఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, నియోజకవర్గం అభివృద్ధి పై ఎడ్ల సుధాకర్ రెడ్డి చర్చించారు.

*–అంబర్ పేట, మార్చ్ 12 (నిఘా న్యూస్):*

## నిఘా ఎఫెక్ట్..

## నూతన కమిషనర్ ను నియామకం

### మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్

**మద్దూర్, మార్చి 12 (నిఘా న్యూస్):** కలం నిఘా దిన పత్రికలో మద్దూరు మున్సిపాలిటికి శాశ్వత కమీషనర్ ను నియమించాలని వార్త ప్రచురించిన నేపథ్యంలో ఎఫెక్ట్ పడింది. ఈ నెల11 న మున్సిపాలిటీ పరిధిలోని రెనివాట్ల మాజీ సర్పంచ్ భవాని శంకర్ శాశ్వత కమీషనర్ ను నియమించాలని కలెక్టర్ కు వినతి అందజేశారు.కలం నిఘా న్యూస్ దాన్ని హైలెట్ చెయ్యడంతో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రత్యేక చొరవతో యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ నుంచి చెవ్విళ్ళ శ్రీకాంత్ ను బదిలీ చేసి మద్దూర్ కు నియమించారు. దీంతో పలువురు నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ట్విన్నింగ్ లో అవగాహన

**ధర్మపురి, మార్చి 12 (నిఘా న్యూస్):** ధర్మారం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల బొమ్మ రెడ్డి పల్లి, ప్రాథమికోన్నత పాఠశాల గోపాల్ రావు పేట విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్విన్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఐఎఫ్ బి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. పాఠశాలలోని లేబరేటరీ లో విద్యార్థులకు వివిధ సైన్స్ పరికరాలను గూర్చి తెలియజేశారు. గ్రంథాలయంలోని పుస్తకాలని చదివించి గ్రంథాలయం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.ప్రభాకర్, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎల్.మాలతీలత,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేష్, మదనయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నేరువరం మండల మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య జన్మదిన వేడుకలు గన్నేరువరం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానకొండూరు నియోజకవర్గం అధ్యక్షులు గంప వెంకన్న, సంఘం జిల్లా నాయకులు కటుకం తిరుపతి, మాజీ సర్పంచ్ నగేష్, మార్గం మల్లేశం, పుల్లెల రాము, కోలుపుల రవీందర్, వీరస్వామి, చిగురు అంజయ్య, గంప మహేష్, తిరుపతి, మంగరాపు లక్ష్మణ్, కయ్యం శ్రీకాంత్, బొమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

*–గన్నేరువరం, మార్చి 11 (నిఘా న్యూస్):*

## నేటి నుండి శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

### ఎమ్మెల్యేను ఆహ్వానించిన దేవాలయ కమిటీ

**మోత్కూరు, మార్చి 12 (నిఘా న్యూస్):** మోత్కూరు లోని శ్రీ రామలింగేశ్వర స్వామికి మార్చి 13 గురువారం నుండి జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని బుధవారం హైద్రాబాద్ లోని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు నివాసానికి వెళ్లి ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య,బయ్యని రాజు,బండారు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 106కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి

**తాండూరు, మార్చి 12 (నిఘా న్యూస్):** వెనుకబడిన బషీరాబాద్ మండలాన్ని ఆదర్శ మండలం గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి వెల్లడించారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని టాకీ తండాలో రూపాయలు 38 కోట్లతో బషీరాబాద్ నుండి మైల్వార్ గ్రామం వరకు నూతన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాలాల మండలం అగ్గనూరు గ్రామం నుండి బషీరాబాద్ మండల కేంద్రము వరకు రూపాయలు 68 కోట్లతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పేర్కొన్నారు. మొత్తం రూపాయలు 106 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని వివరించారు. దీంతో మండల ప్రజల సూదీర్ఘకాల సమస్య నెరవేరిందని మండల ప్రజలు ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కలాల్ నర్సింలు గౌడ్, మాజీ జెడ్పిటిసి రాకేష్ మహారాజ్, ఆర్ అండ్ బిల్డింగ్ డి. ఈ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్దు, మునీర్, మస్తాన్, అనూప్ ప్రసాద్, నర్సింలు, శ్రీకాంత్, రియాజ్, సతీష్, మోహన్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర విధానాలపై రైతులు ఉద్యమించాలి

### రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు

**మధిర, మార్చి 12(నిఘా న్యూస్):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి పట్ల రైతులు ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు అన్నారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం మండల మూడో మహాసభ మడుపల్లి సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పంగా శేషగిరిరావు,చావా మురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు హాజరై హేమంతరావు మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం సరిగా అమలు చేయడం లేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ పథకం సైతం సగానికి సగం రైతులకు అందలేదన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వానికి భవిష్యత్తు లేదన్న వాస్తవాన్ని పాలకులు గుర్తించాలన్నారు. తక్షణం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ రవిబాబు, మందడపు రాణి,సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు, సిపిఐ సహాయ కార్యదర్శి మంగళగిరి రామానుజనం, సిపిఐ నాయకులు కార్యకర్తలు, రైతు సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారత దిశగా కూటమి అడుగులు

### టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ అన్నా అనిత

**తిరుపతి, మార్చి 12 (నిఘా న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వలంబన దిశగా పలు సంక్షేమ పథకాలను రూపొందించి తద్వారా మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాలలో రాణించాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని ఇందులో భాగంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కరించుకొని మహిళలు పరుగెత్తండి నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎం. సుగుణమ్మ, నగర కార్పొరేటర్ అనిత కీర్తి లు తెలిపారు. బుధవారం ఉదయం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని రాష్ట్రం మహిళా అభ్యుదయానికి విశేషంగా కృషి చేస్తుందని వారు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ, కల్పనా చావ్లా సావిత్రి పూలే వంటి వారు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించారని పేర్కొన్నారు. నేడు సామాజిక రాజకీయ చట్టసభలలోను సమానంగా రానిస్తున్నారని తెలిపారు. దేశంలోనే రెండోదిగా శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం కొనసాగుతోందని తెలిపారు. తిరుపతిలో శ్రీ పద్మావతి వైద్య కళాశాల ఏర్పడి ఎందరో స్త్రీ వైద్యులు సమాజానికి సేవ చేస్తున్నారని తెలిపారు. మెప్మా ద్వారా ఎందులో మహిళలు ఆర్థిక వాలంబన దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. మహిళలు విద్యావంతురాలు అయితే కుటుంబం, సమాజం,దేశం, బాగుపడుతుందని వారు తెలిపారు. చంద్రబాబు నాయుడు మహిళల అభివృద్ధి లక్ష్యంగా పలు పథకాలను రూపొందించి మహిళల ఆర్థిక స్వాలంబనకు దొహద పడుతున్నారని ఆమె కొనియాడారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి మహిళా నాయక రాళ్లు బ్యాంకు శాంతమ్మ, రేవతి, అనిత పాల్గొన్నారు.

## భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

### మండల వ్యవసాయ అధికారి ఏవో కృష్ణయ్య

**బెల్లంకొండ, మార్చి 12 (నిఘా న్యూస్):** మండలంలోని వన్నాయపాలెం గ్రామం లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రబీ వరి వేరుశనగ పంటలను వ్యవసాయ అధికారి డి క్రిష్ణయ్య పరిశీలించడమైనది. వేరు శనగ కాయలు పూర్తిగా పక్వం చెందిన తరువాత మాత్రమే పంట కోత కు వచ్చి నట్లు భావించి పీకాలి లేదా తాలు శాతం పెరిగి దిగుబడి తగ్గవచ్చును అని తెలిపారు. నేల లో సరిపడా పదును చూసుకొని పీకాలి తద్వారా కాయలు తెగి భూమిలో మిగిలిపోకుండా ఉండును తెలిపారు. వరి పంట లో ఆకు పై అగ్గి తెగులు మచ్చలు ఏర్పడి ఎరుపు వర్ణంనకు మారుతున్నది నివారణకు గాను ట్రై సైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాములు చొప్పున పైరు తడిచేలా పిచికారి చేయుట తో పాటు నత్రజని వాడకం తగ్గించాలని సూచించారు. కంది కనీస మద్దతు ధర క్వింటల్ కి రూ.7550కు అమ్ముకొదలసిన రైతు సోదరులు గ్రామరైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని, తేమ 12 శాతం వరకు అనుమతించ బడును కావున తేమ శాతం రైతు సేవా కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవాలని తెలపడం జరిగింది. రైతు విశిష్ట సంఖ్య కొరకు నమోదుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు వారి విశిష్ట సంఖ్య కోసం పట్టాదారు పాసుబుక్ ,1బి, ఆధార్, ఆధార్ కు అనుసంధానం అయిన మొబైల్ నంబర్,మొబైల్ తో గ్రామం లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని వ్యవసాయ అధికారి తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు కె.సాయి నాగ మణికంఠ ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఇష్టంగా చదివి మంచి ఫలితాలను సాధించండి

### డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు

**రామచంద్రపురం, మార్చి, 12 (నిఘా న్యూస్):** ప్రతి విద్యార్థి కష్టపడి చదివి అక్షర దోషాలు లేకుండా పదవ తరగతి పరీక్షలు వ్రాసి మంచి ఫలితాలను సాధించాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మిట్టూరులోని చేకూరి నాగమ నాయుడు ఎర్రమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. మండల విద్యాశాఖ అధికారి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరుగుతున్నదని తద్వారా విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చు అన్నారు. ఎంఈఓ జయ వేలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా పాఠశాల ఆవరణంలో సరస్వతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి. పాఠశాల కమిటీ చైర్మన్ చిట్టిబాబు, కాకర్ల దేవరాజులు నాయుడు, ఎస్ ఎల్ టి ఏ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్, వెంకట్రామయ్య, దిలీప్ కుమార్ , శ్రీనివాసులు, జ్యోతి, విశ్వనాథం సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### పీవీ పురంలో జెండాలను ఆవిష్కరించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**రామచంద్రపురం, మార్చి 12 (నిఘా న్యూస్):** మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 ఆవిర్భావ వేడుకలు వైభంగా నిర్వహించారు, బుధవారం ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామాలలో నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి గ్రామస్తులతో కలసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు కష్టపడాలని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రజలకు చేస్తున్న నష్టాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేయాలని కోరారు జగనన్న మాత్రం ప్రజలకు మంచి చేయాలని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు నేనున్నాను అన్న భరోసా కల్పించడం కోసం ఢిల్లీ పెద్దలు అందరూ ఏకమైనా,రాష్ట్రంలో అధికార పార్టీ వేదింపులకు గురి చేస్తున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా 14 సంవత్సరాల క్రితం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని పుట్టించారన్నారు. ప్రాంతీయ పార్టీలకు ఎవరో ఒక గాడ్ ఫాదర్ వుంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలే పట్టుకొమ్మలుగా నిలబడ్డారని, పేదల కోసం పార్టీ మరొక్కసారి అధికారం చేపడుతుందని, సువర్ణపాలనను ప్రజల చెంతకు చేరుస్తుందన్నారు. అప్పటి వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏవి బ్రహ్మానంద రెడ్డి, జడ్పిటిసి,ఢిల్లీ రాణి, నాయకులు మాదాసు మురగయ్య,టీ గిరిధర్ రెడ్డి, సిందిల్ కుమార్, భాస్కర్ యాదవ్, ఎన్ వెంకటేష్, వై రాజేష్ కుమార్ ఎంపీటీసీలు సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హోలీ మూడ్‌లో నగర వాసులు

### ఈసారి ప్రత్యేకం స్పెషల్ హెర్బల్ గులాల్.. పుష్ప గన్.. పుష్ప పిచికారి

**అంబర్ పేట, మార్చ్ 12 (నిఘా న్యూస్):** అంబర్ పేట నియోజకవర్గంలో ఈనెల 14వ తేదీన జరిగే హోలీ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు పూసుకొని సంతోషంగా గడిపే రోజు దగ్గరగా వచ్చింది. శుక్రవారం హోలీ పండుగను జరుపుకునేందుకు అంతా తయారయ్యారు. హోలీ కోసం కావాల్సిన రంగులు కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఎప్పటిలాగే మార్కెట్లో లభించే రంగులు కాకుండా ఈసారి వెరైటీ రంగులు లభిస్తున్నాయి. ఎలాంటి హానీ కలిగించని స్పెషల్ హెర్బల్ గులాల్ వంటివి దుకాణాల్లో దొరుకుతున్నాయి. సాంప్రదాయ రంగులతో పాటు విభిన్న రకాల రంగులు, చిన్నారుల కోసం రకరకాల పిచికారిలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ హెూల్ సెల్ రేట్లకే ఇవి అందుబాటులో ఉన్నాయి. ఇందులో కూడా చాలా రకాలు వచ్చాయి. స్పెషల్ హెర్బల్ గులాల్, వాటర్ బెలూన్స్, ఫాగ్ కలర్స్, రెయిన్బో కలర్ స్టిక్, పుష్ప గన్, పుష్ప పిచికారి(గొడ్డలితో), త్రిషూల్ పిచికారి, ఎయిర్ మిషన్ గన్స్, కలర్ స్ప్రే, స్కూల్ బ్యాగ్ గన్స్, ప్రధాని మోడీ బొమ్మతో గల బ్యాగ్ గన్, వీణా పిచికారి, సిల్వర్ గోల్డెన్ కలర్స్ వంటి అనేక రకాలు ఈ షాపులో ఉన్నాయి. హెూళీ పండుగను సంబురంగా జరుపుకునే విధంగా అందరికి నచ్చే, మెచ్చే రకరకాల కలర్స్ యాదవ్ రాఖీ వాలా షాపులో దొరుకుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాలలో లభించే అన్ని రకాల కలర్లు, పిచికారిలు, పిల్లలకు ఇష్టమైనవన్నీ ఇక్కడ లభిస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాలలో ప్రజలు ఉపయోగించే అన్ని రకాల కలర్లు మా షాపులో అందుబాటులో ఉన్నాయని యాదవ్ రాఖీ వాలా షాపు యజమాని కొత్మీర్ చంద్రకాంత్ యాదవ్ తెలిపారు. ప్రధానంగా ఎలాంటి హాని కలిగించని హెర్బల్ గులాల్ తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే చిన్న పిల్లలు రంగులు చల్లుకునేందుకు కావాల్సిన వెరైటీ గన్స్, పిచికారిలు కూడా ఇక్కడ లభిస్తున్నాయని, సరసమైన హెూల్ సెల్ ధరలకే విక్రయిస్తున్నామని తెలిపారు.

## ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు వేగవంత%శీ%గా పరిష్కరించాలి

- పట్టణ గ్రామ పంచాయతీల్లో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు

**సంగారెడ్డి, మార్చ్ 12 (నిఘా న్యూస్):** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులును వేగవంతంగా పరిష్కరించాలని, పట్టణలు గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూల్ చేయాలని జిల్లా అధికారులును కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కీమ్ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ ఆర్ ఎస్) దరఖాస్తుల వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో లే అవుట్ల రెగ్యులరైజేషన్ కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని త్వరగా పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఫోన్ కాల్ చేసి రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ఈ నెల 31లోపు పూర్తి ఫీజు చెల్లించిన వారికి 25శాతం రిబేట్ వర్తిస్తుందని స్పష్టమైన సమాచారం తెలియ జేయాలనీ సూచించారు. మున్సిపల్ పట్టణలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలన్నారు. గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు ప్రయోజనం కలిగేలా వేగంగా సమస్యలు పరిష్కరించి, రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇంటి పన్ను (హౌస్ టాక్స్) ప్రాపర్టీ టాక్స్ 100 శాతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయ వనరులను మెరుగుపరిచేందుకు పన్నుల వసూలు అత్యంత కీలకమని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి, పన్నుల వసూళ్లు పూర్తిగా చేయాలని తెలిపారు. ఇంటి పన్ను (హౌస్ టాక్స్) ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పట్టణం, గ్రామంలో 100 శాతం పన్ను వసూలు చేయాలనే లక్ష్యంగా పెట్టు కొని పన్ను వసూలు చేయాలనీ తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాయిబాబా, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మోత్కూర్ కాంగ్రెస్‌లో గ్రూపుల మాయ

**మోత్కూరు, మార్చి 12(నిఘా న్యూస్):** మోత్కూరు మండలంలో గత రెండు నెలలుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు గత ప్రభుత్వ పాలన గురించి ప్రస్తుత ప్రభుత్వ పాలన గురించి ఇరు పార్టీలు ఒకరినికోకరు మాటలతో సాధింపు? చేసుకోడమే తప్ప ఏమీ లేదు. బుధవారం మోత్కూర్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో గుమ్మడికాయ దొంగ ఎవరంటే మేమే అన్నట్లు కాంగ్రెస్ నాయకులు ఎందుకు భుజాలు తడుముకుం టున్నరని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి, మండల పార్టీఅధ్యక్షులు పొన్నేబోయిన రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షులు జంగ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ మండల నాయకులు ప్రతిపక్షంగా మేము అడిగినదానికి సమాధానం చెప్పకుండా వంకర టింకర మాటలెందుకు అని,మేము మీరు ఇలా ప్రెస్ మీట్ పెట్టడం కాదు బహిరంగ చర్చ కు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు ఎందుకు ఎగిరెగిరి పడుతున్నాడు మేము అడిగింది ఏంది,నువ్వు చెప్తున్న సమాధానం ఏమిటి అని, దుకాణ సముదాయమునకు మొత్తం సుమారు రూ.60లక్షలు ఖర్చు అయితే నీవు కట్టించిన బాత్రూంకే రూ.12 లక్షలు అవుతాయా? మాజీ చైర్మన్ కంచర్ల అశోక్ రెడ్డి హయాంలో 10ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే నువ్వు వచ్చినాక మూడు కేంద్రాల ఎందుకయ్యాయని, ఆర్భాటంగా ఎమ్మెల్యేతో ప్రారంభిం చిన కందుల కొనుగోలు కేంద్రంలో ఒక గింజ ఎందు కుకొనలేదు అదినీ అసమర్ధతకాదా అని అన్నారు. పెట్రోల్ బంక్‌లో రూ.50 లక్షలు వృధా ఖర్చు అన్నావు ఉన్నావు కదా,ఆ పెట్రోల్ బంకుకు రూ.14 లక్షల కన్నా ఎక్కువ కాలేదు. మాజీ చైర్మన్ కంచర్ల హయాం లో అవినీతి జరిగింది అన్నావు కదా! చైర్మన్ లుగా ఉన్నప్పుడు మీ కుటుంబం నుండే కదా వైస్ ఛైర్మన్‌గా ఉన్నది అవినీతి నిజమైతే అప్పుడెందుకు ప్రశ్నించలేదు. దానిలో ఉన్న మతలబు ఏమిటని వీటికి సమాధానం చెప్పాలి అన్నారు. కాంగ్రెస్‌లో మేమంతా ఒక్కటే అంటు న్నారు ఒక్కటే అయితే ఎల్.ఎన్ గార్డెన్‌లో జరిగిన సమావేశానికి మీరెందుకు పోలేదు,మొన్న జరిగిన ప్రెస్ మీట్‌లో వారెందుకు రాలేదు. మున్సిపాలిటీ రోడ్డు విషయంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ రోడ్డుకి ఇరువైపులా 50ఫీట్లు ప్రతిపాదన చేస్తే వ్యాపారస్తుల కోరికమేరకు 40ఫీట్లు వరకు కుం దించారు. మరి ఆ 40ఫీట్ల రోడ్డు విషయంలో ఎందుకు సమ న్యాయంలేదని,అంబేద్కర్ చౌరస్తా నుండి పెద్దమ్మ గుడివరకు 40ఫీట్లు రోడ్డు ఉన్నదా!మీ కాంగ్రెస్ నాయ కుల ఇంటి వద్ద 30ఫీట్ల లోపే ఉన్నది దీనికేమి సమా ధానం చెప్తారు అని అన్నారు. రేపు విలేకరుల సమ క్షంలో రోడ్డు కోలవడానికి మీరుసిద్ధమా అని,మీ హయాంలో కొందరు కౌన్సిలర్లు ప్రజల అవసరాలను కాదని తమ సొంత లాభంకోసం వెంచర్లలో తమకు అనుగుణంగా సిసి రోడ్లు వెసుకున్నది వాస్తవం కాదా అని అన్నారు. మీ ప్రెస్ మీట్‌లో ఇద్దరు ముగ్గురు తప్ప అందరూ పదవుల కోసం పార్టీ మారిన వాళ్లే కదా!ఇది కూడ ఆరోపనేనా అని అన్నారు. ఇప్పటివరకు మున్సి పాలిటీలో జరిగిన అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ హయాంలో జరిగిం దని, మీరు చేస్తున్న పనులను కూడా మాజీ ఎమ్మెల్యే తేచ్చిన నిధులతోనే జరుగుతుంది. ఇది నిజం అని అన్నారు. మా హయాంలో మాజీ ఎమ్మెల్యే చొరవతో విలేకరులకు ఇళ్లపట్టాలిచ్చాం. ఆ స్థలాలలో మీరు ఇల్లు కట్టి ఇవ్వండి విలేకరులపై కూడా రాజకీయం ఎందు కు. ప్రతిపక్షంగా అడిగే హక్కు మాకుంది. ప్రభుత్వ పరంగా సమాధానం చెప్పే బాధ్యత మీకు ఉంటుందని సమాధానం చెప్పచేతకాక ఎదురుదాడి చేస్తామంటే మేము కూడా సిద్ధంగా ఉన్నామని, ఇకనైనా జ్ఞానోదయం తెచ్చుకుని ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుకోసం, మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసంధృష్టి పెట్టండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి రాంపాక నాగయ్య, రైతుబంధు మాజీ అధ్యక్షులు కొండ సోమల్లు,వస్తాద్,కంచర్ల క్రాంతి కుమార్, దాసరి నరేష్,నేర్లకంటి మచ్చగిరి, విద్యాసాగర్, శోభన్ బాబు,కూరెళ్ల రమేష్,సుక్క అశోక్,పొన్నేబోయిన మచ్చగిరి, నేర్లకంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాచాల అరాచకాలను అరికట్టాలి

● బిసి పొలిటికల్ జేఏసీ నుంచి తప్పుకోవాలి ● చెలిమిల్ల గౌడ సంఘం నాయకులు

**పెబ్బేరు, మార్చి12 (నిఘా న్యూస్):** బీసీ పొలిటికల్ జేఏసీ పేరు చెప్పుకొని రాచాల యుగంధర్ గౌడ్ అక్రమాలకు పాల్పడుతున్నారని గౌడ సంఘం నాయకులు ఆరోపించారు. బుధవారం చెల్లి మిళ్ళ, కిష్టారెడ్డిపేట గౌడ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాచాల యుగంధర్ గౌడ్ మంగళ వారం చెలిమిళ్ళ గ్రామంలో మార్నింగ్ వాక్ పేరుతో పర్యటించి కళ్ళు దుకాణం అక్రమంగా నడుపుతున్న వారితో డబ్బులు తీసుకొని అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఆయన చేపట్టిన మార్నింగ్ వాక్ కు 40 వేల రూపాయలు ఖర్చు పెట్టినందుకు వారు చెప్పినట్లుగా మాట్లాడడం జరిగింది.అతను గౌడ కులస్తుడా లేదా మరెవ్వరని ప్రశ్నిస్తున్నారు. కళ్ళు దుకాణం నిర్వహణపై గ్రామంలో పెద్ద ఎత్తున గొడవ జరిగితే పట్టించు కోకుండా ఉన్నారని విమర్శించారు.కోర్టులో కేసు ఉన్నప్పటికీ రాచాల యుగేందర్ గౌడ్ అనుచరులు దౌర్జన్యంగా గ్రామంలో కళ్ళు దుకాణం అక్రమంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. కళ్ళు దుకాణం నిర్వహిస్తున్న వారు నెలకు నీకు ఎన్ని డబ్బులు ఇస్తున్నారని ప్రశ్నించారు.ఎమ్మెల్యే పేరు చెప్పుకొని చిన్నారెడ్డి వర్గాన్ని బదలం చేయడానికి గ్రామానికి వచ్చి కళ్ళు గొడవ పెట్టి పోయారని విమర్శించారు. లైసెన్సులు లేకపోయినా కళ్ళు దుకాణం కొనసా గిస్తున్న వారికే రాచాల యుగేందర్ గౌడ్, సహక రిస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రజలు రాచాల యుగంధర్ గౌడ్ ఆగడాలను గమనించాలని తెలిపారు.రాచాల ఎవరు డబ్బులు ఇస్తే వారి మాట మాట్లాడతారని ఆరోపించారు. బీసీలను మోసం చేయడానికి బీసీ జేఏసీ పేరు పెట్టుకుని అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని, ఆయన వెంట

గతంలో తిరిగిన బీఆర్ఎస్ పార్టీ దొంగల్ని తిప్పుకుంటున్నారని ఆరోపించారు.బిసి పొలిటికల్ జేఏసీ నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవన్న గౌడ్, మోహన్ గౌడు, శ్యాంసుందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ గౌడ్, అంజన్న గౌడ్ పాల్గొన్నారు.



## కేకే చొరవతో పారుతున్న నక్క వాగు

### హర్షం వ్యక్తం చేసిన రైతులు

**ముస్తాబాద్, మార్చి 12(నిఘా న్యూస్):** సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కే.కే మహేందర్ రెడ్డి చొరవతో రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలోని నక్క వాగు. జల కళ సంతరించుకుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు పేర్కొన్నారు. నీటి ఎద్దడితో ఎండుతున్న పంటలను సస్యశ్యామలం చేయడానికి మల్లన్న సాగర్ నుండి సాగునీటిని విడుదల చేయడంతో సిద్దిపేట నారాయణపేట మీదుగా ఇబ్రహీంపూర్ చెరువు నిండుకొని అక్కడి నుండి నక్క వాగు చేరుకోని నక్క వాగు నుండి ముస్తాబాద్ మండలానికి సంబంధించిన గన్నెవాని పల్లె, సేవలాల్ తండా, పోతుగల్, తెర్లుమద్ది, ఆవునూర్,తుర్కపల్లి, తంగళ్ళపల్లి మండలం గండి లచ్చపేట వాగులోకి మల్లన్న సాగర్ నీరు చేరనుందని రాజు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి నీటిని అందించిన కేకే మహేందర్ రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## హోలీ సందర్భంగా మద్యం షాపులు బంద్

**హైదరాబాద్, మార్చ్ 12(నిఘా న్యూస్):** హోలీ పండుగ సందర్భంగా ఈనెల 14వ తేదీన హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మద్యం షాపులను మూసివేస్తూ కమిషనర్ సివి ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు దుకాణాలను మూసివేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. స్టార్ హోటల్స్, రిజిస్టర్ క్లబ్ లోని బార్లకు మినహాయింపు ఉంటుందని తెలిపారు.

## ఆన్‌లైన్‌లో శ్రీరామ నవమి కళ్యాణ టిక్కెట్లు విక్రయం

**భద్రాచలం, మార్చి 12(నిఘా న్యూస్):** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 30 వ తేదీ నుండి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీ స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా ఏప్రిల్ 6న శ్రీ సీతారాముల కళ్యాణం, 7న శ్రీ స్వామి వారి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి వారి కళ్యాణం, పట్టాభిషేకం తిలకించడానికి ఈ నెల 20నుంచి వివిధ సెక్టార్ లకు సంబంధించిన టికెట్స్ నేరుగా, 12వ తేదీ బుధవారం నుంచి ఆన్లైన్లో విక్రయించనున్నట్లు రామాలయం ఈఓ రమాదేవి తెలిపారు. కళ్యాణం, పట్టాభిషేకం కు రాలేని భక్తుల కోసం పరోక్ష సేవలు పొందవచ్చని అన్నారు. ఆన్లైన్లో టికెట్స్ https://bhadradritemple.telangana.gov.in ద్వారా 12వ తేది నుండి ఆన్లైన్లో పొందవచ్చని తెలిపారు.

## ఆశ వర్కర్లపై అఘా యిత్యానికి పాల్పడ్డ నిందితున్ని శిక్షించాలి

### నిరసన వ్యక్తం చేసిన ఆశా కార్యకర్తలు

**నారాయణపేట, మార్చి 12 (నిఘా న్యూస్):** జగిత్యాల ఆశా వర్కర్ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుని కఠినంగా శిక్షించాలని బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి ఆమెకు అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆశ యూనియన్ కోటకొండ పిహెచ్‌సి నాయకురాలు రాధిక డిమాండ్ చేశారు. నారాయణపేటపేట మండల పరిధిలోని కోటకొండ గ్రామంలో సబ్ సెంటర్ ముందు భోజన విరామం సమయంలో ప్లే కార్డ్స్ పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులకు హింసలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వాలు కఠినంగా శిక్షించలని డిమాండ్ చేశారు. మహిళాలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, రక్షణ లేకుండా పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నేతలు కృష్ణవేణి, సరసమ్మ మంజుల వెంకటేశ్వరి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై కూలీలకు అవగాహన కల్పించాలి

- జిల్లాలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి
- మండల అధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

**ములుగు, మార్చి 12 (నిఘా న్యూస్):** ప్రస్తుత వేసేవి కాలంలో పలు రకాల కూలీ పనులకు వెళు న్న కూలీలకు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు వడ దెబ్బపై అవగాహన సదస్సులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.జిల్లాలో అన్నిచోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి జిల్లా వైద్య, విద్య, వ్యవసాయ శాఖ, మండల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధిక మొత్తంలో నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని పనికి ఆహార పథకం వెళుతున్న కూలీలకు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించడమే కాకుండా వారు పనిచేస్తున్న చోట్ల త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేవనే ఆరోపణ రావద్దని, అవసరమైన పక్షంలో అదనపు ఓఆర్ఎస్ ప్యాకెట్లను తెప్పించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. మండలాలలో వివిధ శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వడదెబ్బకు గురైన వ్యక్తులకు సకాలంలో వైద్య సేవలు అందించడానికి వైద్యులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. డాక్రా గ్రూపు మహిళలచే వృద్ధులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. బడి పిల్లలను ఎట్టి పరిస్థితిలో బయటికి పంపవద్దని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడిన పక్షంలో వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వేసవి కాలం ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కూలీలు వడదెబ్బకు గురైన పక్షంలో వెంటనే వారిని తరలించడానికి 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండి దగ్గర్లోని ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. జిల్లాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థుల వివరాలను తనకు అందజేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కూలీలు ప్రతిరోజు 11గంటలలోపే పనులను ముగించుకోవాలని, వృద్ధులు ఆరుబయట తిరగకుండా సూచనలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ గోపాల్ రావు, జిల్లా పంచాయితి అధికారి దేవ్ రాజ్, డిఈఓ పాణిని, డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు, ఎలక్ట్రిసిటీ డిఈ నాగేశ్వర రావు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా రోబోల మయం

### గీతాంజలి పాఠశాలలో రోబోల ప్రదర్శన

**రామచంద్రాపురం, మార్చి 12 (నిఘా న్యూస్):** భవిష్యత్తులో అన్ని రంగాలలో వచ్చేది రోబోల యుగమే అని రామచంద్రపురం మండల ఎంఈఓ వి మార్కండేయనాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న గీతాంజలి ప్రైవేట్ స్కూల్లో రోబోల ప్రదర్శనలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంఈఓ మార్కండేయ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రోబో ఎగ్జిబిషన్ ఆయన తిలకించి పిల్లలను రోబో ఎలా పనిచేస్తుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ వి.మార్కండేయ నాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ రాబోయే కాలంలో రోబోలే కీలక మన్నారు. ప్రతి కార్యాలయంలో మనుషులకు బదులు రోబోలే పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నెల్లూరి మాధవి, పాఠశాల అధినేత ఎన్ గోపిచౌదరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫామ్ హౌస్ కట్టి...
## భూములు కొల్లగొట్టిన అధికార పార్టీ నేత

- ప్రభుత్వ జీవోలు అధికార పార్టీ నేతలకు వర్తించవా
- ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్న అధికారులు
- ఇల్లందు ఆదివాసీ సంఘాల మండిపాటు

**ఇల్లందు, మార్చి 12 (నిఘా న్యూస్):** ఇల్లందు చెరువు కట్ట పరిధిలో మాజీ మున్సిపల్ చైర్మన్ అక్రమ ఫామ్ హౌస్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల అండదండలతో నేడు ఓ విలాసమైన ఫామ్ హౌస్ నిర్మించడంపై ఆగ్రహిస్తున్న ఆదివాసి సంఘాలు, ప్రభుత్వాలు మారి ఏడాదిన్నర కావోస్తున్న ఇల్లందులో ప్రభుత్వ అధికారుల తీరు మారేలా లేదం టున్నారు. మున్సిపల్ చైర్మన్‌గా అధికారంలో ఉన్నప్పుడు, అధికార మదంతో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసి చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి న మాజీ మున్సిపల్ చైర్మన్ 603 సర్వే నెంబర్‌లో రెవెన్యూ.ఫారెస్ట్ భూములకు సంబంధించి ఏకంగా 18 ఎకరాల భూమిని కబ్జా చెయ్యగా, ఓ ఆదివాసి మహిళ అట్టి కబ్జాలను ప్రతిఘటించి వెలుగులోకి తెచ్చినా, అడుగులకు మడుగులోత్తే అధికారుల వల్ల ఫలితం లేకుండా పోయిందన్నారు. 609ప్రభుత్వ భూమిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా ప్రవేట్ స్కూల్ భవన నిర్మాణాలు చేపడుతున్న కనీసం కన్నెత్తి చూడని అధికారులు తీరు పట్ల నిరసన వ్యక్తం అవుతుంది. రోజురోజుకు దిగజారుతూ ప్రజలలో పలుచనవ్వడం గమనార్హం, రెవిన్యూ, మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమ ఫామ్ హౌస్ కట్టి, ప్రభుత్వ భూములు కొల్లగొట్టి తనకేమి తెలియనట్టుగా నటిస్తున్నారని, ఇలాంటి వ్యక్తుల వల్ల షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసీల హక్కులు కోల్పోవడమే కాకుండా ఆదివాసి మనుగడ లేకుండా పోయే అవకాశం ఉందంటున్నారు. రాబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందంటూ పేర్కొన్నారు. ఇల్లందులో అధికారులు తీరు ఎలా ఉందంటే కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కొల్లగొట్టిన వారిపై చర్యలు చేపట్టాల్సింది పోయి, కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కబ్జా రాయుళ్లను పక్క నెట్టుకుంటే ప్రజలలో పార్టీ కనమరుగయ్యే ప్రమాదం ఉండటమే కాక రాబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ కి పతనం తప్పదు అంటున్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన మాతృదేవోభవ

**బాలాపూర్, మార్చ్ 12 (నిఘా న్యూస్):** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంవిఎస్ఆర్ కాలేజ్ ప్రదేశంలో మతిస్థిమితం లేని వ్యక్తి ప్రశాంత్ ను మాతృదేవోభవ అనాథాశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు గట్టుగిరి చేరదీశారు. తనను ఎవరో కొట్టడానికి వెంబడిస్తున్నారని డయల్ 100కు కాల్ చేయగా, ఆదిభట్ల పోలీస్ సిబ్బంది వెళ్లి చూడగా ప్రశాంత్ ఒంటిపై షర్ట్ లేకుండా రోడ్డుపై పడుకొని వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాడని గమనించగా ప్రశాంత్ మానసికస్థితి సరిగా లేదని గుర్తించి వారు మాతృదేవోభవ అనాథాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. త్వరలోనే అతని పూర్తివివరాలు కనుగొని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని గట్టు గిరి తెలిపారు.

## దువ్వాడపై పోలీసులకు జనసేన ఫిర్యాదు

**శ్రీకాళహస్తి, మార్చ్ 12 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి లో డీఎస్పీ కార్యాలయంలో జనసేన పార్టీ నాయకులు దువ్వాడ శ్రీనివాస్ పై డిస్పీకి పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కొట్టే సాయి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా దూషిస్తూ,50 కోట్లు తీసుకుంటు న్నాడు అని, అలాగే జనసేన కార్యకర్తలను సైకోలు అని మాట్లాడటం తగదని చెప్పారు. ఓడిపోయిన వైసీపీ నాయకులే ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్‌ను దూషించడం వల్లనే మేము ఓడిపోయామని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. కానీ ఇంకా కొంత మంది నాయ కులకు బుద్ధి రాలేదని, ఇకనైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లా డాలని లేకుంటే జన సైనికులు అందరూ తగిన శాస్తి చేయవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, గరికపాటి చంద్ర, చిరంజీవి, అరిగల వేణు, పగడాల ప్రతాప్, ఢిల్లీ బాబు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ భక్తుల ఆధ్వర్యంలో గోటి తలంబ్రాల సేకరణ

**దమ్మపేటఐ, మార్చి 12 (నిఘా న్యూస్):** దమ్మపేట సీతారామ భక్త కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం సీతా రాముల వారి కళ్యాణానికి గోటి తలంబ్రాలు సేకరణలో భాగంగా గోటి తలంబ్రాలు వలవటం జరిగింది. ముక్కోటి ఏకాదశి రోజు నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించి భద్రాచలం సీతారాముల వారి కళ్యాణంలో ఉపయోగించే తలంబ్రాలలో కలపడానికి సేకరించిన గోటి తలంబ్రాలను రామాలయంలో అందజేయడం జరుగుతుంది అని సీతరామ భక్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సీతారామ భక్త కమిటీ అధ్యక్షురాలు మురహరి గంగ, సత్యావతి, సరస్వతి, అత్తులూరి కుమారి, కందుకూరి విజయ, రావెల్లి సత్యవతి, పానుగంటి నర్మద, పసుమర్తి భవ్య, రావెల్లి భవాని, రాసూరి మహాలక్ష్మి, గట్ల రాధ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com